



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి

నిబంధనలు సడలిస్తేనే..



- తుఫాను నేపథ్యంలో రైతుల ఎదురుచూపులు
- యంత్రాల ద్వారా వరికోతలు
- ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- సంచుల కొరత లేకుండా చూడాలని వినతి

జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు మొదలయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో యంత్రాలతో కోత కోసి ధాన్యం నూర్పిళ్లు చేస్తున్నారు. మొంథా తుఫాను కారణంగా కంకి పగిలిపోయి పాలు పోసుకోలేదు. గాలుల వల్ల గింజలు కొంతమేర రాలిపోవడం, వరి నేలవాలిన కారణంగా ధాన్యం దెబ్బ తినడమో జరిగింది. దిగుబడులు తగ్గే పరిస్థితుల్లో ప్రభుత్వం నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని, సంచులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, మొవ్వ, గూడూరు, గుడ్లవల్లేరు తదితర మండలాల్లో ముందస్తుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన పొలాల్లో యంత్రాలతో వరి కోతలను రైతులు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 34 రైతుసేవా కేంద్రాల ద్వారా 2,800 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వాతావరణం అనుకూలంగా ఉంటే రానున్న వారం రోజుల్లో వరికోతలు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారుల అంచనా. ఈనెల 20వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా వరికోతలు ముమ్మరంగా సాగుతాయని, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

మిల్లుల్లో కార్మికుల కొరత

జిల్లాలో 165 రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిలో డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులు 75 ఉన్నాయి. మిల్లర్లు గత నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో బ్యాంకు గ్యారంటీ చెల్లించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధిక శాతం మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను చూపారు. అయితే ఈ ఏడాది కొత్త చిక్కు వచ్చిపడింది. జిల్లాలోని అధిక శాతం మిల్లుల్లో బిహార్‌కు చెందిన కూలీలు ధాన్యం దిగుమతి, మిల్లింగ్ పనులు చేస్తూ ఉంటారు. బిహార్‌లో ఎన్నికలు జరుగుతుండటంతో అక్కడి నుంచి కూలీలు ఇంకా జిల్లాకు తరలి రాలేదు. దీంతో మిల్లుల్లో కూలీల కొరత వేధిస్తోంది. బిహార్‌లో ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత కూలీలను రప్పించేందుకు మిల్లు యజమానులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెల 27 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లుగా ప్రకటించినా మొంథా తుఫాను

మిగతా 6లో..

కేంద్రబృందం పర్యటన నేడు

మచిలీపట్నం,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు కేంద్ర బృందం సోమవారం జిల్లాలో పర్యటించనుంది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ విభాగం డైరెక్టర్ డాక్టర్ కె. పొన్నుస్వామి, నీటివనరుల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు బైరి, విద్యుత్ విభాగం అథారిటీ డెప్యూటీ డైరెక్టర్ ఆర్తీసింగ్, గ్రామీణాభివృద్ధిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనా బృందం సోమవారం అమరావతిలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు కంకిపాడు మండలం పునాదిపాడులో తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలిస్తారు. గన్నవరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. ఆ తరువాత ఏలూరు జిల్లా పర్యటనకు వెళతారు.

జిల్లాలో 287 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు అధిక మద్దతు ధరను ఇచ్చే ఏ మిల్లులకైనా ధాన్యం విక్రయించుకునే వెసులుబాటు అధికారులు కల్పించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని మిల్లులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని రైతులు అంటున్నారు.

అన్నదాతను ఆదుకుంటాం

- మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి

మచిలీపట్నం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని, అండగా ఉంటుందని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్ గృహంలో ఆదివారం మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి పాత్రికేయులతో మాట్లాడారు. రవీంద్ర మాట్లాడుతూ, మొంథా తుపాను సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్షేత్రస్థాయిలో అధికారులందరినీ అప్రమత్తం చేసి తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొన్నారన్నారు. పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించి రక్షణ కల్పించిందన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రతి ఒక్కరికీ, ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించిందన్నారు. ప్రాథమిక

మిగతా 6లో..



భక్తజనకీలాద్రి

ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి క్యూలైన్లలో బారులు తీరారు. దుర్గమ్మను కనులారా చూసి పరవశించిపోయారు. భక్తుల రద్దీని గమనించిన ఈవో శీనానాయక్ ప్రొటోకాల్, వీఐపీ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకున్నారు. (ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి)

డెత్ హైవే!



హనుమాన్‌జంక్షన్ నుంచి గూడవల్లి వరకు ప్రమాదకరంగా జాతీయ రహదారి (ఇన్‌సెట్‌లో) హనుమాన్ జంక్షన్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్‌హెచ్-16పై డేంజర్ జర్నీ!
- గూడవల్లి - హనుమాన్ జంక్షన్ మధ్య ఎక్కువ ప్రమాదాలు
- నెల రోజుల వ్యవధిలో 25 చోట్ల.. 15 మంది మృత్యువాత

జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)పై గూడవల్లి నుంచి హనుమాన్ జంక్షన్ వరకు డెత్ హైవేగా మారింది. కేవలం నెల రోజుల వ్యవధిలో 25 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 15 మంది మృత్యువాత పడ్డారు. భారీ వాహనాల మితిమీరిన వేగం, హైవే మీద, హైవే మార్జిన్లలో ఇసుక, మట్టి, కంకర ఉండటంతో వాహనాలు బ్యాలెన్స్ కోల్పోతున్నాయి. రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలను తప్పించబోయే క్రమంలో కూడా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు భద్రతా కమిటీ తక్షణం పరిశీలన జరిపి ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో విస్తరించిన కోల్‌కత్తా-చెన్నై 16వ నెంబర్ జాతీయ రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. నెల రోజుల వ్యవధిలో 25 కిలోమీటర్ల విస్తీర్ణంలో 25 ప్రమాదాలు జరగడం.. ఈ ప్రమాదాల్లో 15 మంది ప్రాణాలు కోల్పోవడం ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. జాతీయ రహదారులపై ప్రయాణించాలంటేనే భయపెట్టేలా ఈ ప్రమాదాలు జరిగాయి. ఎన్నో కుటుంబాలను శోకసముద్రంలో ముంచేశాయి. జాతీయ రహదారులపై ప్రమాదాలు సర్వసాధారణమని భావించే వారిని సైతం ఈ ప్రమాదాలు గగ్గోర్పాటుకు గురి చేశాయి.

రోడ్డు దాటుతుంటే కారు ఢీకొంది..

హనుమాన్‌జంక్షన్ రూరల్ మండల పరిధిలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై వేలేరు అడ్డ రోడ్డు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న అతనిని వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. అత్యంత తీవ్రస్థాయిలో జరిగిన ఈ ప్రమాదం ఆ రోజు ఉదయాన్నే అక్కడి ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. మరో రెండు రోజుల తర్వాత ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి స్పాట్‌లోనే చనిపోయాడు. బైక్‌పై వెళ్తున్న అతడిని లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటన స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న బైక్ పరికరాలు, అతని భౌతికకాయం ప్రమాద తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఈ ప్రమాదం సైతం తెల్లవారుజామునే జరిగింది.

ఆ 25 కిలోమీటర్లు అత్యంత ప్రమాదకరం

హనుమాన్‌జంక్షన్, ఆత్కూరు, చినఅవుటపల్లి, గన్నవరం, కేసరపల్లి, గూడవల్లి, రామవరప్పాడు, విజయవాడ (కనకదుర్గ వారధి) ప్రాంతాలను కలుపుకుంటూ జాతీయ రహదారి-16 వెళ్తుంది. అయితే హనుమాన్‌జంక్షన్ నుంచి గూడవల్లి వరకు సుమారు 25 కిలోమీటర్ల పొడవునా ఈ రహదారి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

ప్రధానంగా హనుమాన్‌జంక్షన్ శివారు ప్రాంతం, పొట్టిపాడు టోల్ గేట్ పరిసరాలు, చినఅవుటపల్లి సిద్ధార్థ మెడికల్ కాలేజీ, కేసరపల్లి, గూడవల్లి ప్రాంతాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఈ ప్రదేశాల్లోనే ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాలు ఎందరో ప్రయాణికులను బలిగొంటున్నాయి. జాతీయ రహదారిపై ప్రమాదాలు సర్వసాధారణం అని ఆయా ప్రాంతాల ప్రజలు భావించే స్థాయిలో గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. అయితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సైతం భయకంపితులను చేసేలా గడిచిన 30 రోజుల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాహనంతో రోడ్డుపైకి వెళ్లాలంటనే భయం వేసేలా ప్రమాదాలు జరుగుతున్నాయని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

మితిమీరిన వేగంతోనే..

లారీ, కారుల మితిమీరిన వేగమే ఈ ప్రమదాలకు కారణమని ఆయా ప్రాంతాల ప్రజలు

మిగతా 6లో..

నిడుమోలు వద్ద ఫ్లై ఓవర్!



- విజయవాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్ - 65లో
- అప్రోచ్‌లతో కలిపి కిలోమీటరు నిర్మాణం
- మూడు మేజర్ బ్రిడ్జిలు, ఒక మైనర్ బ్రిడ్జికి ప్రతిపాదన
- 11 సబ్‌వేలు, వెహికల్ అండర్‌పాస్‌లకు కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ- మచిలీపట్నం అరవై ఐదవ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65)పై నిడుమోలు దగ్గర ఫ్లై ఓవర్ ఏర్పాటుకు డీపీఆర్‌లో ప్రతిపాదించారు. మొత్తం 690 మీటర్ల పొడవున ఈ ఫ్లై ఓవర్‌ను నిర్మించటానికి కన్సల్టెన్సీ ప్రతిపాదించింది. విజయవాడ - మచిలీపట్నం ఆరు వరసల విస్తరణ ప్రాజెక్టులో భాగంగా మూడు మేజర్ బ్రిడ్జిలు, ఒక మైనర్ బ్రిడ్జిని ప్రతిపాదించారు. వయాడక్ట్ కేటగిరీలో మాత్రం నిడుమోలు దగ్గర ఫ్లై ఓవర్‌ను ప్రతిపాదన చేశారు. అప్రోచ్‌లతో కలిపి దాదాపుగా కిలోమీటరుకుపైగా ఈ ఫ్లై ఓవర్ ఉండనుంది. కొద్ది రోజుల కిందట కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాప్రతినిధులకు కన్సల్టెన్సీ ప్రతినిధులు తెలిపిన డీపీఆర్ వివరాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.910.87 కోట్లు అవుతుంది. ఇప్పటికే ఉన్న సబ్‌వేలు, వెహికల్ అండర్ పాస్‌లు కాకుండా కొత్తగా 11 సబ్‌వేలు, వెహికల్ అండర్ పాస్‌లను ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించటం జరిగింది. బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు నాలుగు కిలోమీటర్ల పొడవున యథాతథంగానే ఉంటుంది. డ్రెయిన్లను మాత్రమే చేపడతారు. కానూరు నుంచి దావులూరు వరకు ప్రస్తుత నాలుగు వరసల రోడ్డుకు అదనంగా రెండు వైపులా సర్వీసు రోడ్లను ఏర్పాటు చేస్తారు. దావులూరు నుంచి బందరు వరకు ఆరు వరసల రోడ్డుగా ప్రతిపాదించటం జరిగింది.



కార్తీక సందడి



కార్తీక మాసం వన సమారాధనలు ఆదివారం సందడిగా జరిగాయి. బందరు, అవనిగడ్డ, గుడివాడ, కూచిపూడి, నున్న తదితర ప్రాంతాల్లో జరిగిన వనసమారాధనలు ఐక్యతను చాటాయి. అవనిగడ్డలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల వనసమారాధన నిర్వహించారు. బందరులో జరిగిన వనసమారాధనల్లో మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొన్నారు.



గుండెపోటుతో చిలకలపూడి ఎస్సై మృతి

- మంత్రి పార్థసారథికి ఎస్కార్ట్‌గా నూజివీడు వెళ్తుండగా ఘటన

మచిలీపట్నం టౌన్/గుడివాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి పోలీస్‌స్టేషన్ ఎస్సై, మంత్రి కొలుసు పార్థసారథి ఎస్కార్ట్ పోలీసు అధికారి ఆర్.ఎస్.రంగనాథరావు ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మచిలీపట్నం నుంచి సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఎస్కార్ట్‌గా నూజివీడుకు వెళ్తుండగా గుడివాడ దగ్గర అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే సమీపంలోని గుడివాడ ఏరియా

మిగతా 6లో..



స్పందన నిల్!

- పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణపై అనాసక్తి
- విజయవాడ డివిజన్ క్లస్టర్ ప్రైవేటీకరణకు సింగిల్ బిడ్
- లాభదాయకంగా ఉండేందుకు క్లస్టర్‌ను బ్రేక్ చేయాలంటున్న సంస్థ
- అందుకు అనుగుణంగా ఓ ఉన్నతాధికారి మౌఖిక ఆదేశం
- ఏ నిర్ణయం తీసుకోని ఏపీటీడీసీ
- మరోవైపు న్యాయ పోరాటం దిశగా ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పర్యాటక యూనిట్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) పిలిచిన టెండర్లకు స్పందన అంతంత మాత్రంగా ఉంది. విజయవాడ డివిజన్ యూనిట్ క్లస్టర్‌కు సింగిల్ టెండర్ పడినట్టుగా తెలుస్తోంది. ఆ ఒక్క సంస్థ పేరేమిటన్నది రహస్యంగా ఉంచారు. మరో వారం రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. యూనిట్ లాభదాయంగా ఉన్నప్పటికీ ప్రధానమైన భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్క్‌లు కృష్ణా వరదలను ఎదుర్కోవాల్సి ఉండటంతో చాలా సంస్థలు వెనుకడుగువేశాయి. మన రాష్ట్రానికి చెందిన సంస్థలు అయితే బిడ్లు వేయకూడదని నిర్ణయించుకున్నాయి. ప్రైవేటు హోటల్స్, రిసార్ట్స్ రంగంలో ఉన్న వారు సమావేశం ఏర్పాటు చేసుకుని మరీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో విజయవాడ డివిజన్ పర్యాటక యూనిట్ల క్లస్టర్‌కు ఒక్క బిడ్ కూడా పడదని అంతా భావించారు. టెండర్ల గడువు ముగిసేనాటికి అనూహ్యంగా ఒక బిడ్ పడటం గమనార్హం. సింగిల్ బిడ్ ఎవరు వేశారన్నది కూడా ఆసక్తిగా మారింది. పర్యాటక యూనిట్లను ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టడానికి తహతహలాడుతున్న ఓ ఉన్నతాధికారి ఉత్తరాది సంస్థను రంగంలోకి దించారన్న చర్చ కూడా తీవ్రంగా నడుస్తోంది.

లాభదాయకంగా ఉన్న వాటిని దక్కించుకునేందుకు ఎత్తుగడ

ఏపీటీడీసీ పర్యాటక యూనిట్ల వారీగా పిలిచిన టెండర్లకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దగా స్పందన లేదని తెలుస్తోంది. కేవలం నాలుగు సంస్థలు మాత్రమే ఆసక్తి చూపినట్టు సమాచారం. ఈ సంస్థలన్నీ కూడా సిండికేట్ అయ్యాయని తెలిసింది. ఇవన్నీ తాజాగా ఒక ప్రతిపాదనను తెరమీదకు తెచ్చాయి. ఆ ప్రతిపాదన మేరకు.. క్లస్టర్ కింద చేర్చిన యూనిట్లను స్ప్లిట్ చేయాలని డిమాండ్ లేవనెత్తాయి. ఉదాహరణకు విజయవాడ డివిజన్ క్లస్టర్ పరిధిలో భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్క్, బాపట్ల సూర్యలంక బీచ్, నాగార్జున సాగర్ రిసార్ట్స్ ఉన్నాయి. ఈ నాలుగింటిలో ఎక్కువగా భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్క్‌లకు ఆదరణ

మిగతా 6లో..



పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

సుబ్బారాయుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

» ఒక్కరోజు ఆదాయం రూ.12.24 లక్షలు

మోపిదేవి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ఆదివారం ప్రత్యేకత కావటంతో పలుప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేషపూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వివిధ సేవా రుసుముల ద్వారా ఒక్కరోజుకు 12,24,960లు ఆదాయం సమకూరినట్టు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.



ట్రాఫిక్ దిగ్బంధనంలో మోపిదేవి

ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానికి వేలాదిగా భక్తులు తరలిరావటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా వాహనాల పార్కింగ్‌కు ఈసా కర్యం ఏర్పడింది. చల్లపల్లి ప్రధాన రహదారికిరువైపులా ఆక్రమణలు పెరిగిపోవటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, సమస్యను పరిష్కరించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



గన్నవరం వచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

ముగిసిన విద్యార్థుల విజ్ఞాన యాత్ర

గన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు అధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ పేరిట ఢిల్లీలో పర్యటించిన 52 మంది విద్యార్థులు యాత్ర ముగించుకుని విజయవాడ చేరుకున్నారు. ఆదివారం ఎయిరిండియా విమానంలో తిరిగి వచ్చిన వారికి పలువురు అధికారులు గన్నవరంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉత్సాహం కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థుల మనో వికాశానికి యాత్ర మంచిదన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేశ్ విద్యా విధానంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు.



తాడేపల్లి ఇస్కాన్ మందిరంలో కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతిని దుర్గగుడికి ఆహ్వానిస్తున్న చైర్మన్, ఈవో

ఇంద్రకీలాద్రికి రండి..

» కంచికామకోటి పీఠాధిపతికి ఆహ్వానం

ఇంద్రకీలాద్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంచికామకోటి 70వ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతిని దుర్గగుడికి విచ్చేయాలని ఆదివారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, కొందరు వేద పండితులు, అర్చకులు ఆయనను కోరారు. నగరం సమీపంలోని కరకట్టపై ఉన్న ఇస్కాన్ మందిరంలో బస చేసిన శంకరవిజయేంద్ర సరస్వతిని దుర్గగుడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, వేద పండితులు, తదితరులు ఆయన వద్దకు వెళ్లారు. ఆలయం తరపున వేదోక్త విధి విధానాలు, ఆలయమర్యాదలు, పీఠాధిపతులకు అందించాల్సిన సత్కారాలు పాటించారు. అనంతరం స్వామివారితో ట్రస్టబోర్డు, ఈవో, స్థానాచార్యుడు కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో జరుగుతున్న పూజాధికాల విశేషాలను వెల్లడించారు. వేదోక్త, శాస్త్రోక్త విధానాలలో మల్లేశ్వరస్వామికి జరుగుతున్న అభిషేకాలు, సహస్రలింగార్చన, విధివిధానాలు గురించి వివరించారు. దేవస్థానానికి విచ్చేసి స్వామిని, అమ్మవారిని దర్శించుకుని భక్తులకు అనుగ్రహ భాషణం చేయాలని కోరారు. అయితే స్వామివారు ఒకటి, రెండు రోజుల్లో దేవస్థానానికి వచ్చే అవకాశం ఉందన్నారు.

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి రాష్ట్రమంతా వ్యాపించాలి

» రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

» ఘనంగా స్వచ్ఛ చల్లపల్లి 11వ వార్షికోత్సవం

» డాక్టర్ డీఆర్కే దంపతులకు అభినందన



హైవేపై వీధిదీపాలను ప్రారంభించిన కలెక్టర్ డీకే బాలాజీ, చిత్రంలో కాలుష్యనియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డాక్టర్లు గురవారెడ్డి, డీఆర్కే దంపతులు; సంపద తయారీకేంద్రం సందర్శన

చల్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి రాష్ట్రమంతటా వ్యాపించాలని, రాష్ట్రంలో మరెన్నో స్వచ్ఛ గ్రామాలు తయారుకావాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య ఆకాంక్షించారు. స్వచ్ఛ చల్లపల్లి 11వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం చల్లపల్లిలో జరగ్గా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక స్వగృహ ఫంక్షన్ హాలులో జరిగిన సభలో కృష్ణయ్య మాట్లాడుతూ, స్వచ్ఛ చల్లపల్లిని చూసి ఇతర గ్రామాలు స్ఫూర్తినిపొందాలని పిలుపునిచ్చారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చల్లపల్లిని సందర్శిస్తే స్వచ్ఛ చల్లపల్లికి విస్తృత ప్రచారం లభిస్తుందనీ, ఆ స్ఫూర్తి మరికొన్ని గ్రామాలకు విస్తరిస్తుందని తెలిపారు. మన కోసం మనం ట్రస్ట్‌కు వైద్యదంపతులు స్వంత డబ్బును లక్షల్లో ఖర్చుచేస్తూ కార్యక్రమాన్ని కొనసాగిస్తుండటం స్ఫూర్తిదాయకం అన్నారు. స్వచ్ఛ సారధులు డాక్టర్లు డీఆర్కే ప్రసాద్, పద్మావతి, స్వచ్ఛ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, డీఆర్కే దంపతుల త్యాగం, సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సేవకు ప్రతిరూపంగా నిలిచిన స్వచ్ఛ కార్యకర్తలను అభినందించారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్ ఎండీ డాక్టర్ ఎవి.గురవారెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛచల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకమనీ, యువతను మరింతగా భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కాలేషావలి మాట్లాడుతూ, స్వచ్ఛకార్యకర్తలతో కలిసి గ్రామంలో సేవలందించటం తనను ఎంతగానో ప్రభావితం చేసిందన్నారు. స్వచ్ఛ చల్లపల్లి సారధి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ, స్వచ్ఛ ఉద్యమ ప్రస్థానాన్ని తెలియచేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛచల్లపల్లి మరో సారధి డాక్టర్ టి.పద్మావతిలు మాట్లాడుతూ.. స్వచ్ఛఉద్యమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అతిధులు తెల్లవారుజాము నుంచీ మూడు గంటల పాటు గ్రామంలో పర్యటించి స్వచ్ఛ చల్లపల్లి ద్వారా తీర్చిదిద్దిన ప్రదేశాలను సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో యువనేత మండలి వెంకట్రామ్, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, కాలుష్యనియంత్రణ మండలి ఇంజనీర్ శ్రీనివాస్, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఈవో పివి.మాధవేంద్రరావు, ఎన్నార్ నాదెళ్ల సురేష్, డాక్టర్ ఎం.వరప్రసాద్, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, ప్రాతూరి శాస్త్రి, మోర్ల శివ, నాదెళ్ల వేణు, దాసి సీతారామరాజు, అడపా గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తుడాన్ మడ్డీ చిక్కాడు

» బెంగళూరులో పట్టుకున్న కాప్స్

» డ్రగ్ 'ప్రేమికుల' కేసులో వెలుగులోకి..

» అసలు పేరు మధుసూదనరెడ్డి

» మారుపేరు మడ్డీతో వ్యవహారాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

మధుసూదన్‌రెడ్డి.. ఇది అసలు పేరు. ఈ పేరులో మొదటి రెండు ఇంగ్లీష్ అక్షరాలు, చివరి మూడు అక్షరాలను కలిపి సృష్టించుకున్న పేరు 'మడ్డీ'. అసలు పేరు కంటే సృష్టించుకున్న పేరుతోనే మత్తు ప్రపంచంలో ఎదిగాడు. ఉన్నత విద్యను అభ్యసించే యువతకు మత్తును విక్రయించాడు. స్వల్పకాలంలో మత్తు అంటే మడ్డీ, మడ్డీ అంటే మత్తు అన్న స్థాయికి ఎదిగాడు. కొన్నినెలలుగా విజయవాడ పోలీసులకు వాటెండ్ డ్రగ్ మేకర్‌గా ఉన్న మడ్డీ బెంగళూరులో దొరికిపోయాడు. పోలీసులు ఆదివారం అతడిని పట్టుకున్నారు. విశాఖకు చెందిన డ్రగ్ ప్రేమికులు గత సెప్టెంబరులో ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన దాడుల్లో ఎండీఎంఏ డ్రగ్‌తో దొరికిపోయారు. ఈ కేసులో మడ్డీ పేరు ప్రముఖంగా వినిపించింది. విషయం తెలుసుకున్న అతడు అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు తనపై దృష్టి పెట్టడం లేదని గమనించిన తర్వాత కలుగు నుంచి బయటకు వచ్చాడు. మడ్డీ కోసం ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్న మాచవరం పోలీసులు అజ్ఞాతవాసాన్ని వీడి అతడు బయటకు వచ్చాడని నిర్ధారించుకున్నారు. ఒక ఎస్‌ఐ ఆధ్వర్యంలో బృందం బెంగళూరుకు వెళ్లి మడ్డీ చేతులకు సంకెళ్ల వేసి విజయవాడకు తీసుకొస్తున్నారు.



ఇదీ మడ్డీ స్టైల్

ఈ మడ్డీ పేరుతోనే యువతకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీని సమకూర్చుతున్నాడు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకు చెందిన మల్లె మధుసూదనరెడ్డి అలియాస్ మడ్డీ బెంగళూరులో ఉంటూ మాదకద్రవ్యాలను సరఫరా, విక్రయించడం చేస్తున్నాడు. విశాఖకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అర్జా శ్రీవాత్సవ్, అతడి ప్రియురాలు బొడ్డేపల్లి హవీల డిలైట్ బెంగళూరు నుంచి బస్సులో డ్రగ్స్‌ను తీసుకెళ్తుండగా విజయవాడ మహానాడు జంక్షన్‌లో ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సెప్టెంబరులో పట్టుకున్నారు. దీనిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాంత్, హవీల వాంగ్మూలంతో మరికొంతమందిని మాచవరం పోలీసులు అరెస్టు చేశారు. మధుసూదనరెడ్డి పేరు వెలుగులోకి రావడంతో పోలీసులు అతడికోసం తీవ్రంగా గాలిస్తున్నారు. శ్రీవాత్సవ్, హవీల పోలీసులకు పట్టుబడిన తర్వాత అతడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. డ్రగ్స్ సరఫరాలో ఆరితేరిన అతడు తన అసలు పేరు తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. అందుకోసం మడ్డీ అనే పేరును సృష్టించుకున్నాడు. డ్రగ్స్ కోసం సంప్రదింపులు చేసే వారందరికీ ఇదే పేరు చెప్పేవాడు. మధుసూదనరెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు, యువకులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను భారీగానే సరఫరా చేసినట్టు తెలిసింది. బెంగళూరులోనే ఈ డ్రగ్‌ను అందజేయడానికి 10-15 డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకున్నాడు. డ్రగ్ కోసం సంప్రదింపులు చేసిన వారందరినీ బెంగళూరుకు పిలిపించుకుంటున్నాడు. పేమెంట్ యాప్‌ల ద్వారా డ్రగ్స్‌కు సంబంధించిన చెల్లింపులు పూర్తయ్యాక మాత్రమే సరుకున్న డ్రాపింగ్ పాయింట్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. ముఖ్యంగా నగరాల్లోని యువతతో మడ్డీకి సంబంధాలున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ విక్రయాలు సాగడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. శ్రీవాత్సవ్, హవీల చిక్కిన తర్వాత పోలీసులు జోగా లోహిత్ యాదవ్‌కు సంకెళ్లు వేశారు. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. స్వరూపరాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడే కాకుండా లోహిత్‌తో చాటింగ్, వాట్సాప్ కాల్స్ చేసిన వారు తలోదిక్కుకు పారిపోతున్నారు. ఈ డ్రగ్స్ సరఫరాలో మధుసూదన్‌రెడ్డి ఒక్కడే పాత్ర పోషించాడా, అతడి వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు. మడ్డీగా చలామణి అవుతున్న మధుసూదన్‌రెడ్డిని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతోపాటు ప్రస్తుతం రిమాండ్లో ఉన్న శ్రీవాత్సవ్, హవీల, లోహిత్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాలన్న యోచనలో పోలీసులున్నారు.



నిందితుడితో రైల్వే పోలీసులు

ఆస్తి తగాదాతో అన్న హత్య!

» కేసును ఛేదించిన రైల్వే పోలీసులు

గుడివాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి విషయంలో సొంత అన్నపైనే కక్ష పెంచుకుని, హత్యకు పాల్పడిన కేసును రైల్వే పోలీసులు ఛేదించారు. రైల్వే సీఐ ఏవీ దుర్గారావు ఆదివారం విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 3న గుడివాడ రైల్వే స్టేషన్ సమీపంలోని ధనియాలపేట వద్ద రెండు రైల్వేలైన్‌ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి ఒంటిపై కత్తిపోట్లు ఉండటంతో రైల్వే డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు పోలీసులకు కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. మృతుడు బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సోనుకుమార్ చౌహాన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. ఇటీవల గుడివాడ పామర్రు రోడ్డులో పనిలోకి చేరిన సోనుకుమార్ మైనూర్‌లో ఉన్న తన అన్న పప్పుచౌహాన్‌ను హత్య చేయాలని ముందుగానే పథకరచన చేశాడు. ఆ ప్రకారం అన్నకు ఫోన్ చేసి కూలీలు ఉన్నారని, వారిని తీసుకువెళ్లడానికి గుడివాడ రావాలని తెలిపాడు. ఈక్రమంలో ఈనెల 3న తెల్లవారుజామున ధనియాలపేట వద్ద గల రెండు రైల్వేట్రాక్‌ల వద్ద పప్పుచౌహాన్ ఒంటిపై కత్తిపోట్లతో శవమై పడిఉన్నాడు. తన అన్నతో ఆస్తి విషయంలో ఉన్న తగాదాలే హత్యకు ప్రధాన కారణమని నిందితుడు సోనుకుమార్ విచారణలో అంగీకరించినట్టు సీఐ దుర్గారావు పేర్కొన్నారు. కేవలం వారంరోజుల వ్యవధిలోనే కేసును ఛేదించిన ఎస్‌ఐలు మహబూబ్ షరీఫ్, శివన్నారాయణ, ఆర్‌పిఎఫ్ ఏఎస్‌ఐ షేక్‌అక్బర్, సిబ్బంది ఎం.సాయిశివకృష్ణ తదితరులను సీఐ అభినందించారు.

అన్నదాతను ఆదుకుంటాం

(5వ పేజీ తరువాయి)

అంచనాల ప్రకారం జిల్లాలో దాదాపు 46 వేల హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టం ఎన్యూమరేషన్ క్షేత్ర స్థాయిలో జరుగుతోందన్నారు. పంట నష్టం అంచనాను సకాలంలో పూర్తి చేసి, ప్రతి రైతును అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. హెక్టార్‌కు రూ. 25 వేల నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, గత ప్రభుత్వాల కంటే మిన్నగా కూటమి ప్రభుత్వం వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ, అధిక మొత్తంలో పింఛన్ల పెంపుదల, కౌలు రైతులకు కార్డుల మంజూరుతో ప్రయోజనం చేకూర్చిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలిస్తేనే..

(5వ పేజీ తరువాయి)

కారణంగా వరికోతలు వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో సాధ్యమైనంత త్వరగా వరికోత లను పూర్తి చేసే పనిలో రైతులు ఉన్నారు.

సంచులు అందుబాటులో ఉంచాలి

వరికోతలు ముమ్మరంగా సాగితే ధాన్యం పట్టుబడికి సంచుల సమస్య అన్ని గ్రామాల్లో తలెత్తుతుందని రైతులు అంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి గన్నీ బ్యాగులు కావాలని మిల్లులకు ఆన్‌లైన్‌లో ఇండెంట్ పెడితే, దాని ప్రకారం మిల్లర్లు వాటిని పంపాల్సి ఉంది. ఈ అంశంపై ఆన్‌లైన్‌లోనే వివరాల సమాచారాన్ని నాలుగు విడతలుగా ఇచ్చి పుచ్చుకోవాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలోని అన్ని మిల్లులకు అనుసంధానం చేయకపోవడంతో గన్నీ బ్యాగుల స రఫరాపై ప్రస్తుతం అయోమయం నెలకొంది. ఈ వ్యవహారాన్ని సాధ్యమైనంత త్వరగా సరిదిద్దాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల్లో ఒక్కసారిగా వరికోతలు ప్రారంభమైతే ధాన్యం కొనుగోలు చేయడం కష్టమవుతుందని, రైతుసేవాకేంద్రాల ద్వారా ఎంత మంది రైతులు ఎప్పుడు వరి కోతలు కోయాలో అంక్షలు అమలు చేయాలని అధికారులు చెబుతున్నారని, వాతావరణం సాధారణంగా ఉంటే ఇబ్బంది లేదని, అనుకూలంగా లేకుంటే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

దిగుబడి తగ్గనుందా?

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ చివరిలో వరి ఈత, కంకులు పాలుపోసుకునే, కోతకు సిద్ధమైన దశల్లో ఉన్న సమయంలో మొంథా తుఫాను విపత్తు వచ్చిపడింది. దీంతో కంకులు పాలుపోసుకునే దశలో బలమైన గాలుల ప్రభావానికి గింజలు పగిలిపోయి పాలు పోసుకోలేదు. ఈత దశలో ఉన్న వరి నేలవాలిపోయింది. దీంతో పాటు బీపీటీ-5204, బీపీటీ క్రాసింగ్ వంగడాలు, ఇతర సన్నరకాల వరి కోతకు సిద్ధమైన దశలో బలమైన గాలులు కారణంగా కుంకులకు ఉన్న గింజలు కొంతమేర రాలిపోవడం, వరి నేలవాలిన కారణంగా దెబ్బ తినడమో జరిగిందని రైతులు చెబుతున్నారు. పెదన మండలం నందమూరు, తదితర గ్రామాల్లో తుఫానుకు ముందుకు బీపీటీ రకాలు ఎకరానికి 30 బస్తాల దిగుబడి వస్తుందని రైతుల అంచనా వేసుకున్నారు. తుఫాను అనంతరం కోత కోస్తే 22 నుంచి 25 బస్తాల దిగుబడి మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు. తుఫాను ప్రభావంతో వీచిన బలమైన గాలులు కారణంగా ఎకరానికి కనీసంగా ఐదు నుంచి ఏడు బస్తాల ధాన్యం దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు చెప్పుకుంటున్నారు. దీంతోపాటు ధాన్యం రంగు మారడం, సక్రమంగా పక్వానికిరాని గింజలు ఉంటాయని, తాలు తప్పల శాతం కూడా పెరుగుతుందని రైతులు అంటున్నారు. యంత్రాలతో కోతలు కోయిస్తే ధాన్యంలో తాలుగింజలు అలానే ఉండిపోతాయని, మిల్లులో ధాన్యం పోసిన తరువాతనే వీటిని వేరు చేసే అవకాశం ఉంటుందని, దీనివల్ల మిల్లు యజమానులు ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఎన్ని పేచీలు పెడతారనే భయం రైతులను వెంటాడుతోంది తుఫాను గాలుల కారణంగా వరి నేలవాలిపోవడంతో యంత్రాల ద్వారా వరికోతలు కోయిస్తే. ధాన్యంలో మట్టి శాతం కూడా పెరుగుతుందని రైతులంటున్నారు. ఈ ఏడాది తుఫాను పరిస్థితుల దృష్ట్యా ధాన్యం కొనుగోలు నిబంధనలు ప్రభుత్వం కొంత మేర సడలించాలని రైతులు కోరుతున్నారు.



ఇష్టారాజ్యం!

» పీఎన్‌బీఎస్‌లో వ్యాపారుల దందా!

» ధరలు పెంచుకుంటామని ఓ క్యాంటీన్ నిర్వాహకుడి ప్రతిపాదన

» అనుమతి ఇవ్వని బస్‌స్టేషన్ అధికారి

» రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి

» ఆర్టీసీ టేబుల్‌పైకి ప్రతిపాదనల ఫైల్

» ధరలు పెంచేసిన నిర్వాహకుడు

» ప్రయాణికుల ఫిర్యాదులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆసియాలోనే రెండో అతిపెద్దదైన పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్)కు నిత్యం రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఇక్కడ వాణిజ్య కార్యకలాపాలు కూడా భారీ స్థాయిలో జరుగుతున్నాయి. చిన్న చిన్న వ్యాపారాలకు కూడా ఆదరణ ఉంది. ఈ డిమాండ్‌ను మరింత క్యాష్ చేసుకోవటానికి దుకాణదారులు బరి తెగిస్తున్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తరచూ కేసులు రాసి, జరిమానాలు విధిస్తున్నా వీరు మార్పులేదు. జరిమానాలు అయినా కడతారు కానీ, అధిక ధరలకు విక్రయించటం మాత్రం మానరు. దీన్ని బట్టి చూస్తే ఆర్టీసీ అధికారులు విధించే జరిమానాల కన్నా కూడా అధిక ధరలకు విక్రయాలు జరపటం ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటోందన్నది అర్థమవుతోంది.

భారీగా ధరలు పెంచుతూ ప్రతిపాదనలు

ఇటీవల కాలంలో బస్‌స్టేషన్‌లోని ఓ క్యాంటీన్ నిర్వాహకుడు తమ రెస్టారెంట్‌లో అధిక ధరలను వసూలు చేయాలని భావించాడు. భోజనం (సింగిల్, పార్శిల్), టీ, కాఫీ, ఇతర అల్పాహారాలకు ధరలను రూ.10 నుంచి రూ. 20 పెంచుకునేలా ప్రతిపాదనలు తయారు చేశాడు. భోజనం సింగిల్ రూ.120కి అదనంగా రూ.10, పార్శిల్ భోజనం రూ.150కి అదనంగా రూ.10, అల్పాహారాలపై అదనంగా రూ.20, టీపై రూ.5, కాఫీపై రూ.10 చొప్పున అదనంగా వసూలు చేయటానికి బస్‌స్టేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపాడు. డీసీటీఎం దగ్గరకు ముందుగా ఈ ప్రతిపాదన వచ్చింది. దీనిపై డీసీటీఎం అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. బస్‌స్టేషన్‌లో అధిక ధరలపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లో ధరలను పెంచటానికి అనుమతి ఇచ్చేది లేదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. అయినప్పటికీ క్యాంటీన్ నిర్వాహకుడు ఆ అధికారిపై తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చే ప్రయత్నం చేశాడు. తనపై ఒత్తిడి తెస్తున్నారన్న ఉద్దేశ్యంతో సదరు అధికారి క్యాంటీన్ నిర్వాహకుడికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ధరలను పెంచటం వల్ల నీ వ్యాపారం మీద కూడా ప్రభావం చూపిస్తుందని, తర్వాత బాధపడతావని బుజ్జగించే ప్రయత్నం చేశారు. ధరలను పెంచుకోవటానికి అంగీకరించకుండా తనను బుజ్జగించే ప్రయత్నం చేయటంపై క్యాంటీన్ నిర్వాహకుడికి కోపం వచ్చింది. తన రాజకీయ బలం చూపించటం ప్రారంభించాడు. దీంతో బస్‌స్టేషన్ అధికారి ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు పంపారు.

అనుమతి ఇవ్వకుండానే అదనపు ధరలు!

ఉన్నతాధికారుల నుంచి ధరల పెంపునకు ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదు. కానీ, క్యాంటీన్ నిర్వాహకుడు మాత్రం అధిక ధరలను వసూలు చేస్తున్నాడు. ఉన్నతాధికారులు అధికారికంగా ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా అధిక ధరలు వసూలు చేస్తుండటంతో మౌఖికంగా అనుమతులు ఇచ్చారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అధిక ధరలు వసూలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవటానికి సిబ్బంది తటపటాయిస్తున్నారు. మరో వైపు బస్‌స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు అధిక ధరలను వసూలు చేస్తున్నారని ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఒకవైపు ఉచిత బస్సు ప్రయాణం పెట్టిన ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు వచ్చేలా బస్‌స్టేషన్‌లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

డెత్ హైవే

(5వ పేజీ తరువాయి)

చెబుతున్నారు. వాహనాలు వేగంగా వెళ్లేందుకే జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుంది. అయితే ఆయా ప్రదేశాల పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి వాహనానికైనా వేగ నిర్దిష్ట పరిమితులు ఉంటాయి. ఈ పరిమితులను దాటి అతివేగంగా వెళ్లే లారీలు, కారులు ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు దాటుకుంటూ వెళ్లే వారిపైనా, ద్విచక్ర వాహన చోదకులపైనా అతివేగంతో వెళ్లే వాహనాలు విరుచుకుపడి ప్రాణాలు తీస్తున్నాయి. విశాలమైన రోడ్డులో ఇష్టానుసారంగా నడపటం ప్రాణాంతకమవుతోంది. ఈ ప్రాంతంలో జాతీయ రహదారిపై వీధి లైట్లు లేకపోవడం ప్రమాదాలకు ఒక కారణమని ప్రజలు చెబుతున్నారు. దాదాపు ఆరు నెలలుగా లైట్లు వెలగకపోయినా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. లైట్లు లేకపోవడంతోనే కొన్ని ప్రమాదాలు జరిగిన ఉదంతాలను అక్కడి ప్రజలు వివరిస్తున్నారు.

దారిపొడవునా హెచ్చరిక బోర్డులు.. అయినా ప్రమాదాలు

అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డుపై గత ప్రమాదాల రీత్యా దారిపొడవునా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు మాత్రం తగ్గడంలేదు. హెచ్చరిక బోర్డులు పెట్టినా వాహనదారులు వాటిని పట్టించుకోవటం లేదనే అనిపిస్తోంది. ప్రమాదాలకు మూలకారణాలైన వేగనియంత్రణతో పాటు మార్జిన్లలో ఇసుక, కంకర వంటి వాటిని ఈ మార్గంలో తొలగించాల్సిన అవసరం ఉంది.

గుండెపోటుతో ఎస్సై మృతి

(5వ పేజీ తరువాయి)

ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అవనిగడ్డకు చెందిన రంగనాథరావుకు గతంలోనే గుండెకు శస్త్రచికిత్స జరిగిందని సహచరులు తెలిపారు. మంచి క్రమ శిక్షణ గల పోలీస్‌గా పని చేస్తూ ఎందరికో ఆదర్శంగా ఉన్న రంగనాథరావు మృతి పట్ల పోలీసు అధికారులు విచారం వ్యక్తం చేశారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు. ఎస్సై రంగనాథరావు మృతికి మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఎస్సై రంగనాథరావు భౌతికకాయాన్ని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, పోలీసు అధికారులు సందర్శించి నివాళ్ళులర్పించారు. అనంతరం రంగనాథరావు భౌతికకాయాన్ని స్వస్థలం అవనిగడ్డకు తరలించారు.

స్పందన నిల్!

(5వ పేజీ తరువాయి)

ఉండటంతో పాటు లాభదాయకంగానూ ఉంటుంది. దీంతో ఈ రెండు సంస్థలను ప్రైవేటు సంస్థ స్విట్ చేయించటానికి ప్రయత్నాలు చేయటం గమనార్హం.

క్లస్టర్స్‌ను విడగొట్టాలని హుకుం

క్లస్టర్ల వారీగా పొందుపరిచిన పర్యాటక యూనిట్లను విడగొట్టాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారి నుంచి ఏపీటీడీసీకి మౌఖిక ఆదేశాలు వచ్చాయి. దీంతో ప్రైవేటు సంస్థలు చెప్పినట్టుగానే క్లస్టర్‌ను విడగొట్టడానికి మౌఖిక ఆదేశాలు వచ్చినట్టుగా తెలుస్తోంది. దీనిపై ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఏపీటీడీసీ ఉన్నతాధికారులు, ఆఖరుకు చైర్మన్‌తో సహా పర్యాటక యూనిట్లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి అయిష్టంగా ఉన్నారు. అయినా ప్రభుత్వ స్థాయిలో పర్యాటక శాఖ వ్యవహారాలు చూసే ఉన్నతాధికారి ఒత్తిడి తెస్తుండటంతో మారు మాట్లాడలేకపోతున్నారు. స్విట్ విషయంలో ఏపీటీడీసీ అధికారులు ఏం చేస్తారన్నది వేచి చూడాల్సిందే.

తీవ్రమవుతున్న ఉద్యోగుల ఆందోళన

మరో వైపు పర్యాటక యూనిట్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి ఏపీటీడీసీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇప్పటికే ప్రైవేటుకు అప్పగించిన యూనిట్ల ద్వారా తీవ్ర నష్టం కలుగుతోందని, కోట్ల రూపాయల బకాయిలను ఆయా సంస్థల నుంచి రాబట్టుకోలేని పరిస్థితి ఉందని ఉద్యోగులు అంటున్నారు. ఇది చాలదన్నట్టు 33 ఏళ్ల కాలానికి ఏ ప్రాతిపదికన అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు న్యాయ పోరాటం కూడా ప్రారంభించారు. ఈ వ్యవహారాలతో పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణ సర్వత్రా చర్చకు దారితీస్తోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

జంక్షన్ నుంచి జగదల్పూర్‌కు బస్ సర్వీసు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గన్నవరం డిపో నుంచి జగదల్పూర్‌కు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసును హనుమాన్ జంక్షన్ వరకు పొడిగించినట్లు ఆ డిపో మేనేజర్ పి.శివాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ సర్వీస్ గన్నవరం నుంచి బయలుదేరేదని ఇపుడు హనుమాన్‌జంక్షన్ నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో రాత్రి 7గంటలకు బయలుదేరి గన్నవరం, విజయవాడ, తిరువూరు, భద్రాచలం, కుంట మీదుగా జగదల్పూర్‌కు మరుసటి రోజు ఉదయం 8.30గంటలకు చేరుతుందని, తిరిగి అదే రోజు జగదల్పూర్‌లో మధ్యాహ్నం 3.30గంటలకు బయలుదేరి మరుసటి రోజు అదే రూట్‌లో హనుమాన్‌జంక్షన్ ఉదయం 5.15గంటలకు చేరుకుంటుందని తెలిపారు. జంక్షన్ బస్‌స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్, ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు డీఎం పేర్కొన్నారు.

ఆయుష్షు పోసేవారేరి!

- ప్రభుత్వం ఆయుర్వేద వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీ
- నాలుగు నెలలుగా కాంపౌండరే దిక్కు
- ఇబ్బందిపడుతున్న రోగులు
- పట్టించుకోని ఆయుష్ విభాగం అధికారులు




కానూరులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల.. వైద్యుడు లేక ఖాళీగా ఉన్న

(కానూరు - ఆంధ్రజ్యోతి)

రెండున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న తాడిగడప మున్సిపల్ పరిధి కానూరులోని ఆయుష్ శాఖ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో నాలుగు నెలలుగా మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. భారతి విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు ఫ్యాకల్టీగా డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఇక్కడ ఈ ఖాళీ ఏర్పడింది. నాలుగున్నర నెలలక్రితం ఇక్కడ రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసే డాక్టర్ రాగలత బాపట్ల జిల్లాకు బదలీ అయ్యారు. దీంతో ఈ పోస్టులోకి లంకపల్లి నుంచి వి. భారతి బదలీ పై వచ్చారు. ఈమె ఇక్కడ మెడికల్ ఆఫీసర్‌గా నాలుగున్నర నెలల క్రితం బాధ్యతలు తీసుకున్న మరుసటిరోజే డిప్యూటేషన్‌పై వైద్య కళాశాలకు ఫ్యాకల్టీగా వెళ్లారు. దీంతో కానూరు వైద్యశాలకు వారానికి ఐదు రోజులపాటు రోజుకు ఒకరు చొప్పున ఇద్దరు మెడికల్ ఆఫీసర్‌లను డిప్యూటేషన్‌పై వేశారు. సోమవారం మినహా మిగిలిన ఐదు రోజులు వీరు ఇక్కడ పనిచేసేవారు. అయితే వీరి డిప్యూటేషన్ కూడా మూడు నాళ్ల ముచ్చటే అయింది. వీరు రెండు వారాలపాటు డిప్యూటేషన్‌పై పనిచేశారు. ఆ తరువాత వీరి డిప్యూటేషన్ రద్దుకావడంతో నాలుగు నెలలుగా కానూరులోని వైద్యశాలకు కంపౌండరే దిక్కయ్యారు.

వెనుదిరుగుతున్న రోగులు..

నాలుగు నెలలుగా కానూరులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు వైద్యుడు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ వైద్యశాలకు కానూరుతోపాటు తాడిగడప, ఆటోనగర్, పోరంకి, యనమలకుదురు, పెనమలూరు, గంగూరు, గోశాల తదితర గ్రామాల నుంచి రోగులు వైద్యం కోసం ఈ వైద్యశాలకు వస్తుంటారు. వైద్యుడు లేకపోవడంతో రోగులు వెనుదిరుగుతున్నారు. ఆయుష్ ఉన్నతాధికారులు దృష్టిసారించి కానూరు వైద్యశాలకు మెడికల్ ఆఫీసర్‌ను రెగ్యులర్ పద్ధతిపై నియమించాలని రోగులు కోరుతున్నారు.



ఆలయ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే యార్లగడ్డ సూచన

ప్రసాదంపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని, దాతల సహకారంతో ఆలయాలను మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నూతన పాలకవర్గ సభ్యులకు సూచించారు. ఆదివారం రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాల అమ్మవారి ఆలయాల నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెంకట్రావుకు భారీ గజమాలతో నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చైర్మన్ పుట్టపు వెంకటేశ్వ రావుతోపాటు మరో 10 మంది కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయం వెలుపల పాదరక్షలు పెట్టేందుకు స్టాండ్ ఏర్పాటు చేయాలని, ఆలయానికి వచ్చే భక్తులకు టాయిలెట్ సౌకర్యం కల్పించాలని నూతన కమిటీకి సూచించారు. ఆలయ అభివృద్ధికి ప్రయివేటు సంస్థల నుంచి సీజీఎఫ్ నిదులతోపాటు, దాతల సహకారం తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తాను మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, డాక్టర్ దాసరి బాలవర్ధన్‌రావు, ఎఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, జనసేన జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార్‌స్వామి, కూటమి నాయకులు కోనేరు నాని, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, సర్నాల బాలాజీ, కొల్లా ఆనంద్, బొప్పన హరికృష్ణ, గుజ్జర్లపూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కర్మయోగ సిద్ధాంతాన్ని తెలిపేది భగవద్గీత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవాత్మ, పరమాత్మల గురించి తెలియజేస్తూ సర్వమతాలను సమన్వయం చేస్తూ శ్రీకృష్ణుడు అందించినదే కర్మయోగ సిద్ధాంతాన్ని తెలిజేసే భగవద్గీతని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తెలిపారు. మడిచర్లలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక నూజివీడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత ప్రచార సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత లను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, రామాంజనేయులు, శ్రీకాంత్, అశోక్, రామజోగి, శంకర్ పాల్గొన్నారు.



హోమాలు చేస్తున్న భక్తులు

ఘనంగా రుద్రహోమం

గన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీ విశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రుద్ర హోమం నిర్వహించారు. తొలుత స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్రనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం విశ్వేశ్వరస్వామివారికి అభిషేకాలు, పచ్చ కర్పురంతో విశేష అలంకరణ చేశారు. కాసన్నేని శ్రీనివాసరావు, సత్యసునీత దంపతుల నేతృత్వంలో వేద పండితులు రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని సమర్పించారు. స్వామివారిని సీఐ బీవీ శివప్రసాద్, పుర ప్రముఖులు దర్శించుకున్నారు.



శివాలయంలో నవగ్రహ విగ్రహాలకు దాన్యాధివాసం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా నవగ్రహ విగ్రహాలకు అభిషేకాలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల బ్రహ్మసూత్ర మరకత మల్లికార్జునస్వామి దేవ స్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న నవగ్రహ విగ్రహాలకు ఆదివారం ప్రత్యేక అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా పర్యవేక్షణలో యాగశాలలో వేద పండితులు కోసూరి మురళీ కృష్ణమాచార్యులు, బుచ్చి రామశర్మ, ఆలయ అర్చకులు సామవేదం మారుతి శర్మల వేద మంత్రాల నడుమ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విగ్రహాలకు అభిషేకాలు జరిపారు. సభ్యులు తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, రాంబాబు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చెరువులో పడి కాపలదారుడు మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వీరవల్లిలోని పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వ ముత్యాలరావు(48) చేపల చెరువుపై కాపలాగా పనిచేస్తుంటాడని, గుండెపోటు రావడంతో చెరువులో పడి మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడయినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి మృతదేహాన్ని వెలికి తీసి గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తాడిగడపలో జరిగిన కుంతీదేవి ఉత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

వైభవంగా కుంతీదేవి ఉత్సవం

పెనమలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాడిగడప గ్రామంలో టీడీపీ నాయకులు మోత్రపు విశ్వనాథ్ ఆధ్వర్యంలో కుంతీదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, బోడె మనోజ్, తుమ్మల రాంకుమార్, కొండా ప్రవీణ్, మేడసాని రత్నకుమారి, బండారు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

పెనమలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పంచమి సందర్భంగా తాడిగడప శ్రీలక్ష్మీవెంకటేశ్వర గార్డెన్సులో వేంచేసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వందలాది భక్తులు కార్యక్రమంలో పాల్గొని వ్రతములాచరించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముక్తేశ్వరస్వామికి అన్నాభిషేకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెరికీడు ముక్తేశ్వరస్వామికి వేద మంత్రోచ్చారణల మధ్య అన్నాభిషేకం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా నిర్వహించిన ప్రత్యేకపూజలో కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, దాతలు పాల్గొన్నారు. తదనంతరం 7వేల మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. నక్కా బాబు తదితర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఐక్యతకు ప్రతీక వనసమారాధన: చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఐక్యతకు ప్రతీక వనసమారాధన అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వేలేరులోని వేములపల్లి శ్రీనివాసరావు తోటలో ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుటుంబాలతో కూడిన వనసమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్తీకమాసంలో నిర్వహించే ఆధ్యాత్మికతతో కూడిన వనసమారాధనతో కుటుంబాల మధ్య సంబంధబాంధవ్యాలు బలపడటంతో పాటు ఐక్యత పరిడవి ల్లుతుందన్నారు. విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు, సుబ్బారావు, నాగమణి ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించగా విజేతలకు చైర్మన్ చలసాని బహుమతులు అందజేశారు. చిన్నారులు చేసిన నాట్యం, పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. యలమంచలి శ్రీరామచంద్రమూర్తి, నందిగం స్వామి, రంగారావు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ●గన్నవరం మార్కెట్ యార్డు డైరెక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వేలేరు తోటలో ఏర్పాటు చేసిన వనసమా రాధనలో యార్లగడ్డ సతీష్, అట్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వనసమారాధనలో మాట్లాడుతున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

అలరించిన బాలికల నృత్యం

ఉయ్యూరు: కార్తీకమాసం ఆరుద్ర నక్షత్ర పంచమి పురస్కరించుకుని ఉయ్యూరు శ్రీపద్మశాలీయ సేవ, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వనసమారాధనలో ఏలూరుకు చెందిన హాసిని, లాస్యశ్రీ, పూజితల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సంద ర్భంగా పూజా, ఇతర కార్యక్రమాల్లో పలువురు పాల్గొని ఉల్లాసంగా గడిపారు. మహిళలు, బాలికలకు పలు పోటీలు, నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్, టీడీపీ బీసీ విభాగ నాయకుడు అందె జగదీశ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ అతిథులుగా హాజరై నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. సంఘ నాయకులు మూర్తి, చంద్రబోస్, శ్రీధర్ తదిరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ఏఎంసీ ఆవరణలో బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు

● వీరవల్లి మొఖాసలో శ్రీరామమందిరం ఆవరణలో వనసమారాధన అంత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహించారు.

ఘనంగా బ్రాహ్మణ కార్తీక వనసమారాధన

కంకిపాడు : స్థానిక గాయత్రీ ధ్యాన మందిరం లో బ్రాహ్మణ కార్తీక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజ, గోపూజ, ధాత్రీపూజలను బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు నిర్వహించారు. బ్రాహ్మణ సామాజికవర్గ ఐక్యత, ఉన్నతికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయాలని అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రతినిధులు తీర్మానించారు. అనంతరం బ్రాహ్మణ సంఘం ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని సంఘం ప్రతినిధులు దివి రాధాకృష్ణ శ్రీనివాసు, ఉపద్రష్ట గంగాధరరావు, కానూరు భాస్కరరావు, దివి రోహిణి కుమార్ తదితరులు పర్యవేక్షించారు.



డ్రెయినేజీ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు తుమ్మలపల్లి

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించండి

కంకిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడు గన్నవరం రోడ్డులో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ నియోజక వర్గంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని లేని పక్షంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఊరుకునే పరిస్థితి లేదన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ప్రధాన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. గన్నవరం రోడ్డులోని డ్రైనేజీ నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్ర మంలో కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



తాడిగడపలో స్వచ్ఛ భారత్- క్లీన్ అండ్ గ్రీన్ ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

కానూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గత వారం రోజులుగా తాడిగడపలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ ముగింపు సందర్భంగా వాలంటీర్లు స్వచ్ఛ భారత్- క్లీన్ అండ్ గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె. శివరాంప్రసాద్ మాట్లాడుతూ, వారం రోజుల కాలంలో వాలంటీర్లు గ్రామ ప్రజల్లో సామాజిక బాధ్యతా స్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.



విరాళం అందజేస్తున్న భక్తుడు మధుసూదనరావు దంపతులు

అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణానికి రూ.4.10 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపుల పాడు శివాలయం ప్రాంగణంలో నిర్మాణం జరుపుకుంటున్న హరిహర సుత అయ్యప్పస్వామి దేవాలయంకు ఆదివారం భక్తుల నుండి భారీ విరాళాలు అందాయి. బాపులపాడు గ్రామానికి చెందిన భక్తులు పర్వతనేని మధుసూదనరావు, జయ దంపతులు రూ.4లక్షలు, లావు వెంకట రాజేంద్ర ప్రసాద్ రూ.10,116లు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా తెలిపారు. దాతలను కమిటీ సభ్యులు గూడపాటి రత్నశేఖర్ తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, రాంబాబు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉల్లాసంగా సెయింట్ జేవియర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన సెయింట్ జేవియర్ స్కూల్, ఏలూరుకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. బొమ్మలూరుకు చెందిన పూర్వ విద్యార్థి మల్లంపాటి అమర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 1981-82 సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు 42 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకుంటూ అప్పటి అల్లరి చేష్టలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఫోటోలు దిగుతూ ఉల్లాసంగా, అప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలిమెట్ల మోషేబాబు, తణుకు వెంకట సుబ్బారావు, బట్టు సుధాకర్, మల్లంపాటి అమర్ కుమార్, రామ్మూర్తి, టి. శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. 40మంది పూర్వ విద్యార్థులు ఉల్లాసకర వాతావరణంలో ఆహ్లాదంగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో సెయింట్ జేవియర్ పూర్వ విద్యార్థులు

దిక్సూచి

జాతీయ స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో(ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ) ప్రవేశానికి ఉద్దేశించిన జేఈఈ మెయిన్ షెడ్యూల్ ఆరంభమైంది. మొదటి సెషన్ జనవరి 21 నుంచి జరుగనుంది. తదుపరి రెండు నెలలూ ఇంటర్ పరీక్షలతో బిజీబిజీ. అపై ఏప్రిల్ నెలలో రెండోసెషన్ ఉంటుంది. అంటే పది నుంచి పదిహేను రోజుల వ్యవధి మాత్రమే ప్రిపరేషన్‌కు అప్పుడు సమయంఉంటుంది. అలాగే జనవరి సెషన్‌లో ఏదైనా పొరపాటు జరిగితే రెండోదైన ఏప్రిల్ సెషన్‌లో మెరుగుపర్చుకోవచ్చు. ఆ నేపథ్యంలో జనవరి సెషన్‌లోనే మంచి స్కోర్‌కు గట్టి ప్రయత్నం చేయడం మంచిది. అలా చేస్తే ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేరయ్యేందుకు సరిపోను సమయం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో జనవరి సెషన్‌లో మంచి స్కోర్ సాధించేందుకు అనుసరించాల్సిన ముఖ్యమైన కొన్నింటిని చూద్దాం. ప్రధానంగా ఈ సారి ఆన్‌లైన్ ప్రశ్నపత్రం ఫాంట్‌ను పెంచుకునే, తగ్గించుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు.

జేఈఈ మెయిన్
జనవరి సెషన్ బెస్ట్



- ఇంటర్ రెండేళ్ళ సిలబస్ - మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విషయంలో ఈ నెల నుంచే గట్టి పునాదిని ఏర్పర్చుకోవాలి. ముఖ్యంగా ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్‌పై దృష్టిపెట్టాలి. డెబ్బయ్ నుంచి ఎనభై శాతం ప్రశ్నలు ఫౌండేషన్స్‌పైనే ఆధారపడి ఉంటాయని గమనించాలి.
- ఫాస్ట్ రివిజన్ షీట్స్‌ను తయారు చేసుకోవాలి. వాటిలో అన్ని ముఖ్యమైన ఫార్ములా, రియాక్షన్, ఈక్వేషన్‌ని ఒకే చోట సబ్జెక్టువారీగా రాసుకోవాలి.
- ప్రిపరేషన్ సమయంతో ప్రతి రెండు సబ్జెక్టుల మధ్య ట్రాన్సిషనల్ గ్యాప్‌ని తప్పనిసరిగా ఉంచుకోవాలి. పరీక్ష సమయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాలి. జిగ్ జాగ్ లేదంటే ర్యాండమ్ అటెంప్ట్‌లు అస్సలు చేయకూడదు.
- కాలేజీ ముగిసిన తరవాత రోజూ కనీసం నాలుగు గంటల సమయాన్ని స్టడీకి కేటాయించాలి. థియరీతోపాటు కచ్చితంగా న్యూమరికల్స్‌ను సాల్వ్‌చేయాలి. కాలిక్యులేటర్‌ను ఉపయోగించవద్దు. అటెంప్ట్‌లో ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే మీ నోట్స్ లేదంటే పాఠ్యపుస్తకాన్ని రిఫర్ చేయండి.
- టైమ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. గడిచిన కొన్నేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేయడం ద్వారా ఒక నిర్దీత అంచనాకు రావచ్చు. ఏ సబ్జెక్టులో ఏయే కాన్సెప్టుల్లో సులువైన ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకోవచ్చు. తద్వారా వాటిపై శ్రద్ధపెట్టవచ్చు. ఉదాహరణకు ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి సులువైన ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. అక్కడ మిగిలిన సమయాన్ని కష్టమైన ప్రశ్నలను సాల్వ్ చేసేందుకు ఉపయోగించుకోవచ్చు.
- ప్రతి వారం కనీసం రెండు మాక్‌టెస్టులను ప్రాక్టీస్ చేయాలి. టెస్ట్ పూర్తయ్యాక ఎర్రర్ అనాలిసిస్ చేసుకోవాలి. ఏ టాపిక్‌లో ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయో గమనించి, ఆ కాన్సెప్ట్‌ని మరో సారి రివైజ్ చేసుకోవాలి.
- అన్ని చాప్టర్లు అని కాకుండా ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి. మేథ్స్‌లో కాలిక్యులస్, జామెట్రీ; ఫిజిక్స్‌లో మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ; కెమిస్ట్రీలో ఆర్గానిక్‌కు ఎక్కువ వెయిటేజ్ ఉంటుంది.
- మాక్ టెస్టుల్లో స్కోర్ యావరేజ్ అంటే 150కి మించేలా చూసుకోవాలి. ఒకవేళ తగ్గినట్లయితే ఒక చాప్టర్‌పై అవగాహన ఉన్నప్పటికీ చిన్నపాటి తప్పులు ఎలా, ఎందుకు జరుగుతున్నాయో గమనించాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- గెస్ వర్క్ అస్సలు చేయవద్దు. పరీక్షలో కూడా ఎలిమినేషన్ పద్ధతి ఫాలో అవ్వండి. ఎంసీక్యూలో రెండు లేదా మూడు ఆప్షన్స్ తప్పు అని నిక్కచ్చిగా తెలిస్తే జవాబును గుర్తించడం సులువు అవుతుంది.
- అసలు ఎగ్జామ్‌లో కూడా సులువు నుంచి మోడరేట్‌గా ఉండే ప్రశ్నలు, అలాగే మీకు నచ్చిన సబ్జెక్టుతో అటెంప్ట్ మొదలుపెట్టండి. ఇందుకోసం ముందు మొత్తం పేపర్‌ని విశ్లేషించుకోవాలి. అందుకు కనీసం పది నిమిషాలు కేటాయించుకోవాలి. ఒక్క విషయం, కొన్ని సంవత్సరాల ప్రశ్నపత్రాల సరళిని గమనిస్తే, మేథ్స్‌లో అడిగే ప్రశ్నల నిడివి ఎక్కువగా, కఠినంగానూ ఉంటున్నాయి. ఫిజిక్స్‌లో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు వస్తున్నాయి. కెమిస్ట్రీలో సులువుగా, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ ఆధారంగా ప్రశ్నలు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రిపరేషన్ కొనసాగించడం చాలా మంచిది.
- అన్నింటికీ మించి సరైన ఆహార అలవాట్లు, తగిన నిద్ర తప్పనిసరి. డిజిటల్ అడిక్షన్‌కు దూరంగా ఉండటం తప్పనిసరి. అలా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ప్రశాంతత పెరిగి మంచి స్కోర్ సాధించే వీలు ఉంటుంది.

- డాక్టర్ పవన్ కుమార్ కాసు
ఎక్సలెన్సియా, హైదరాబాద్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో
లోకల్ బ్యాంక్ ఆఫీసర్స్

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ శాఖల్లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్(ఎల్‌బీఓ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీటిలో తెలంగాణలో 88, ఏపీలో 5 పోస్టులు ఉన్నాయి.
అర్హత: అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం ఏడాదిపాటు క్లరికల్/ అధికారి కేడర్‌లో బ్యాంకింగ్ రంగంలో పనిచేసి ఉండాలి.
వయస్సు: 20-30 సంవత్సరాల మధ్య.
ఎంపిక: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, లోకల్ లాంగ్వేజ్ పరీక్ష ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 23
వెబ్‌సైట్: https://pnb.bank.in/

బెల్‌లో 340 ప్రొబేషనరీ ఇంజనీర్లు



భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) 340 ప్రొబేషనరీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఇంజనీర్స్(ఎలక్ట్రానిక్స్ 175, మెకానికల్ 109, కంప్యూటర్ సైన్స్ 42, ఎలక్ట్రికల్ 14 పోస్టులు ఉన్నాయి)
అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయస్సు: ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 25 సంవత్సరాలకు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాలకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 14
వెబ్‌సైట్: https://bel-india.in/

ఎన్‌సీపీఎల్‌లో డిప్యూటీ మేనేజర్లు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 114 డిప్యూటీ మేనేజర్(హెచ్ఆర్ 31, ఎఫ్ అండ్ ఎ 48, సీఅండ్ ఎంఎం 34, లీగల్ 1), 8 హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులు ఉన్నాయి. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 27లోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం www.npcilcareers.co.in /www.npcil.nic.in. చూడవచ్చు.

జాబ్ కార్నర్

ఐబీలో 258 మంది ఆఫీసర్స్

కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో 258 అధికారుల(అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/టెక్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది.
పోస్టులు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(90), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(168) పోస్టులు ఉన్నాయి.
అర్హత: ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సైన్సెస్‌లో పీజీ(ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్‌తో ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. 2023, 2024, 2025 గేట్ ఎగ్జామ్(కోడ్ ఈసీ/ సీఎస్)లో నిర్దేశిత అర్హతతో కటాఫ్ మార్కులు సాధించి ఉండాలి.
ఎంపిక: నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 16
వెబ్‌సైట్: www.mha.gov.in/www.ncs.gov.in

ఎన్‌హెచ్‌ఏఐలో...

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధపోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
పోస్టులు: డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) 9, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ 1, జూనియర్ ట్రాన్స్‌లేషన్ అధికారి 1, అకౌంటెంట్ 42 స్టెనోగ్రాఫర్ 32.
పోస్టునుబట్టి ఎంపిక ప్రక్రియ ఉంది. అర్హతలు విడివిడిగా ప్రకటనలో ఇచ్చారు.
ఆఖరు తేదీ: డిసెంబర్ 15
వెబ్‌సైట్: nhai.gov.in/

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) 110 అసిస్టెంట్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. జనరల్ 56, లీగల్ 20, ఐటీ 22, రిసెర్చ్ 4, అఫీషియల్ లాంగ్వేజ్ 3, ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్ 2, సివిల్ 3) పోస్టులు ఉన్నాయి.
అర్హత: పోస్టును బట్టి ఏదైనా పీజీ/ ఇంజనీరింగ్ డిగ్రీ/ లాలో డిగ్రీ ప్లస్ రెండేళ్ళ అనుభవం.
ఎంపిక: రెండో దశలో ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 28
వెబ్‌సైట్: www.sebi.gov.in

నీట్ ఎస్ఎస్ రిజిస్ట్రేషన్

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ - నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ - సూపర్ స్పెషాలిటీ(నీట్ ఎస్ఎస్) 2025కి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆరంభించింది. నవంబర్ 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనిలో సాధించిన మెరిట్ ఆధారంగానే వైద్యవిద్య సంస్థలు అందించే డీఎం, ఎంసీహెచ్, డీఆర్ఎన్‌బీ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తారు. డిసెంబర్ 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా ఈ టెస్ట్ జరుగుతుంది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. **వెబ్‌సైట్:** exam.natboard.edu.in/



టీఐఎఫ్ఆర్‌హెచ్‌లో అడ్మిషన్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ - హైదరాబాద్(టీఐఎఫ్ఆర్‌హెచ్) కెమిస్ట్రీ, ఫిజిక్స్ అడ్మిషన్ బోర్డులు కలపి పీహెచ్‌డీ అండ్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ - పీహెచ్‌డి ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో నాలుగు ఖాళీలు ఉన్నాయి. కోర్సు వచ్చే ఏడాది జనవరి నుంచి ఆరంభమవుతుంది. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: https://gasadmissions.tifrh.res.in
అకడమిక్ కోఆర్డినేటర్ ఈమెయిల్: gasadmissions@tifrh.res.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పెళ్లి షురూ



ప్రియదర్శి ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే'. శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు. వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.



పెద్దితో ఆ కోరిక తీరింది

రామ్‌చరణ్

'సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో పనిచేయాలనేది నా కల. అది 'పెద్ది' చిత్రంతో నెరవేరింది' అని అన్నారు రామ్‌చరణ్. ఏఆర్ రెహ్మాన్ సంగీత విభావరి రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. రామ్‌చరణ్, జాన్వీకపూర్, దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' నుంచి 'చికిరి' పాట లిరికల్ వీడియోను తెరపై ఆవిష్కరించారు. రెహ్మాన్ తనయుడు ఏఆర్ అమీన్ ఈ పాటను వేదికపై ఆలపించారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మాట్లాడుతూ 'నా సంగీత ప్రయాణం తెలుగులోనే ఆరంభమైంది. 'బాహుబలి', 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' వంటి సినిమాలతో తెలుగు సినిమాకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గుర్తింపు, ఆదరణ ఎంతో సంతోషాన్నిస్తోంది. 'నాటు నాటు' పాట ఆస్కార్ గెలవడం మనందరికీ గర్వకారణం' అని చెప్పారు.

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో



ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు వెండితెరకు పరిచయమౌతున్నాడు. కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు, దివంగత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆర్ఎక్స్ 100', 'పలాస' చిత్రాల దర్శకుడు అజయ్‌భూపతి దర్శకత్వంలో జయకృష్ణ హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ఆదివారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు అజయ్ భూపతి. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు పిక్చర్స్ లిమిటెడ్ బేనర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. వర్కింగ్ టైటిల్ 'ఏబీ4'.

క్రైమ్ థ్రిల్లర్



వజ్ర యోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'సీమంతం'. ప్రశాంత్ టాటా నిర్మాత. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా తెరకెక్కించాం. విలన్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'మహిళల వరుస హత్యల కేసు నేపథ్యంలో అల్లుకున్న కథ ఇది. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని తెలిపారు.

వేధింపుల కేసులో ఊహించని మలుపు



సోషల్ మీడియాలో (ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో) మార్ఫింగ్ చేసిన ఫొటోలు, నిరాధార ఆరోపణలతో తనను వేధిస్తున్నారని కథానాయిక అనుపమా పరమేశ్వరన్ కొన్ని రోజుల క్రితం కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఊహించని మలుపు తీసుకుంది. ఎవరో ఆకతాయిలు, పోకిరీ వ్యక్తులు అనుపమను వేధిస్తున్నారని భావించారు. అయితే ఆమెపై వేధింపులకు పాల్పడింది అబ్బాయిలు కాదు, ఓ 20 ఏళ్ల యువతి అని పోలీసుల దర్యాప్తులో తేలింది. తమిళనాడుకు చెందిన నిందితురాలు పలు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను సృష్టించి, అనుపమను లక్ష్యంగా చేసుకొని, అభ్యంతరకర పోస్టులు పెట్టినట్లు తేలింది. నిందితురాలు పిన్న వయస్కురాలు కావడంతో ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి వివరాలను బహిర్గతం చేయదలచుకోలేదు అని అనుపమ తెలిపారు. అయితే ఈ కేసులో చట్టపరమైన చర్యలు మాత్రం కొనసాగుతాయని చెప్పారు. సైబర్ వేధింపులు శిక్షార్హమైన నేరం, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అనుపమ కోరారు.

చిరంజీవిని క్షమాపణలు కోరిన రామ్ గోపాల్





తన తొలి సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవికి కృతజ్ఞతలు చెప్పడంతో పాటు ఆయన్ను క్షమాపణలు కోరారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఆయన దర్శకత్వం వహించిన 'శివ' చిత్రం ఈనెల 14న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ వీడియో సందేశంలో చిత్ర బృందాన్ని అభినందించారు. "శివ' సినిమా చూసి నేను ఆశ్చర్యపోయా. అది సినిమా కాదు ఓ విప్లవం, తెలుగు సినిమాకి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తుండటం మంచి విషయం. చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని చిరంజీవి అన్నారు. ఈ వీడియోను ఆర్జీవీ ఎక్స్‌లో షేర్ చేశారు. 'థాంక్స్ చిరంజీవి గారు.. అనుకోకుండా మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉంటే ఈ సందర్భంగా క్షమాపణలు కోరుతున్నా. విశాల హృదయంతో మా చిత్ర బృందాన్ని అభినందించినందుకు కృతజ్ఞతలు' అని ట్వీట్ చేశారు. గతంలో పలు సందర్భాల్లో మెగా బ్రదర్స్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు రామ్ గోపాల్ వర్మ.

ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా...



'మసూద' ఫేమ్ తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా ఓ చిత్రం ఆదివారం ప్రారంభమైంది. భరత్ దర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఓ హిలేరియస్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటుందని, సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ అన్నారు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈనెల 19 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్ అతి త్వరలోనే పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీవరప్రసాద్, సినిమాటోగ్రఫీ: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచి రాజు.

వినోదం... విజ్ఞానం



వనాలను రక్షించుకోవాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'కలివి వనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, నాగదుర్గ ప్రధాన తారాగణం. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి నిర్మించారు. ఇటీవలె చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసి, రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈనెల 21న 'కలివి వనం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.వినోదంతో పాటు విజ్ఞానాన్ని ఇచ్చే చిత్రమిదని దర్శకుడు తెలిపారు.



మేఘాలయలో చిత్రీకరణ

- వేణు దోనేపూడి

'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాజా రవీంద్ర, విస్మయ్, టిన్ను ఆనంద్ ప్రధాన పాత్రధారులుగా గుణ మాచికంటి తెరకెక్కిస్తున్న చిత్రం 'బా బా బ్లాక్‌షీప్'. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. మేఘాలయలో షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో టీమ్‌ను కలసిన మేఘాలయా ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఓ సినిమా పూర్తి షూటింగ్ మేఘాలయాలోనే జరగడం ఇదే ప్రథమం. ఒక్క రోజులో ఆరుగురు వ్యక్తుల మధ్య జరిగే ఆసక్తికరమైన క్రైమ్ కామెడీ ఇది. ఎప్పుడూ వర్షం పడుతూ ఉండే ఈ ప్రాంతంలో షూటింగ్ అంత సులువు కాదు. అయినా అన్ని సవాళ్లు స్వీకరించి ముందుకు సాగుతున్నాం' అని చెప్పారు. ఈ చిత్రంలో ఉపేంద్ర లిమియే, జార్జ్ మరియన్, రాజా అక్షయ్ లఘుసాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నాలుగు యుగాల నేపథ్యంలో



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. సింపుల్ సుని దర్శకత్వంలో దీపక్ తిమ్మప్ప నిర్మించారు. ఈ నెల 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'నాలుగు యుగాల నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రేమ, పునర్జన్మ, పురాణ గాథలను స్పృశిస్తూ సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం తెలుగు హక్కులను నిర్మాతలు కే. నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి దక్కించుకున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విలియం జే, సంగీతం: జుడా శాండి.

గొప్ప అనుభూతినిచ్చేలా..



కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రధారులుగా హరీశ్ రెడ్డి ఉప్పుల తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు హరీశ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇందులోని అన్ని క్యారెక్టర్లతో మీరు కనెక్ట్ అవుతారు' అని చెప్పారు. నిర్మాత కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ "జిగ్రీస్' ఒక కల్ట్ సినిమాగా ఉండబోతుంది. వినోదంతోపాటు భావోద్వేగాలూ ఉంటాయి' అని తెలిపారు.

కొత్త చిత్రం ప్రారంభం



త్రినాద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా దర్శకుడు కే.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో 'ఇరువురు భామల కౌగిలి'లో అనే కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ బేనర్‌పై శ్రీనివాస్ గౌడ్ నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై నిహారిక కొణిదెల క్లాప్‌నివ్వగా దర్శకుడు బిగోపాల్ కెమెరా స్విచ్చాన్ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

చికిత్స పొందుతూ కల్లుగీత కార్మికుడి మృతి

కూచిపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిడుమోలు శివారు వీరాయిలంకకు చెందిన నారగాని వెంకటేశ్వరరావు (55) ఆదివారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. వారం రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆయన్ని పాముకాటు వేసింది. వెంటనే వైద్య సహాయం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు తెలిపారు. కల్లు గీత కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు, కల్లుగీత సంఘం, సీపీఎం నేతలు పామర్తి శ్రీనివాసరావు, మురాల అచ్చేశ్వరరావు, ఉప్పలపు వెంకటాద్రి, మద్దుల బసవయ తదితరులు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

ఆర్థిక సాయం

పెదపారుపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ4 పథకం పేదరిక నిర్మూలనకు ఎంతగానో దోహదపడుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. దోసపాడుకు చెందిన మూల్పూరి సునీల్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. ఈ క్రమంలో ఆయన విజయవాడ పడమట రమేజా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న సునీల్‌ను పరామర్శించి వైద్యులతో మాట్లాడి అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు గుండపనేని శ్రీనివాసరావు (స్వామి) రూ.25 వేలు పీ4 పథకం ద్వారా చేసిన ఆర్థిక సాయాన్ని పామర్రు ఎమ్మెల్యే చేతులమీదుగా వారికి అందించారు.


భక్తులతో కిటకిటలాడుతున్న చర్చి

ఘనంగా ఆర్సీఎంలో వేదవ్యాపక వారం

గుడివాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : చెవులతో విని, కళ్లతో చూసిన దానిని ప్రతి ఒక్కరికీ తెలపాలని, అందరూ సువార్తను ప్రకటించి, శాంతి, సమాధానాలతో మెలగాలని ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్(ఆర్‌సీఎం) చర్చిలో వేదవ్యాపక వారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సహాయగురువు ఫాదర్ ప్రతాప్, కౌన్సెల్ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, కారే శ్రీనివాసరావు, ఇంటి స్వామిదాసు, రెబ్బా బాలరాజు, వీరాబత్తిన జీవరత్నరాజు, ఉపదేశకుడు టి.క్రీస్తురాజు, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్లు .. తప్పని తిప్పలు

● ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం
● పట్టించుకోని అధికారులు

(పెదపారుపూడి - ఆంధ్రజ్యోతి): మోపర్రులోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి దోసపాడు రైల్వే స్టేషన్ నుంచి మోపర్రుకు వెళ్లే రహదారి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక దీనావస్థలో ఉంది. మోపర్రు - దోసపాడు ఆర్ అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గోతులతో నిండిపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడుతున్నారు. పెదపారుపూడికి వెళ్లేందుకు ఈ రోడ్డు మీద నుంచే ప్రయాణం చేయాల్సి ఉంది. ఈ రహదారిలో భారీ స్థాయిలో గుంతలు ఏర్పడటంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడతామోనని వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. దీనికితోడు కొద్దిపాటి వర్షానికే గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఏది రహదారో, ఏది గోతో తెలియక ప్రమాదాల బారిన పడక తప్పడం లేదు. ఇప్పటికైనా సదరు అధికారులు దృష్టి సారించి ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన మోపర్రు ప్రధాన రహదారి

అధికారులు పట్టించుకోవడం లేదు


మోపర్రు ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా ఉండటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. దోసపాడు వెళ్లేందుకు పెదపారుపూడి మండలం వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు. వర్షం కురిస్తే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి.

బోయిన సాంబశివరావు, మోపర్రు

సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది


ధ్వంసమైన రోడ్లపై ప్రయాణించాలంటే సర్కస్ ఫట్లు చేయాల్సి వస్తోంది. కొద్దిపాటి వర్షానికే బురదగా మారడంతో వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడుతున్నాం.

జూపల్లి రమేష్, మోపర్రు

నిధులు మంజూరు కాలేదు

మోపర్రు నుంచి దోసపాడు వెళ్లే రహదారి మరమ్మతులు చేసేందుకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే గోతుల రహదారికి మరమ్మతులు చేపడతాం.

వెంకట కిషోర్, ఆర్‌అండ్‌బీ డీఈ


వెంకటేశ్వరరావుకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

ఆలయ నిర్మాణానికి విరాళం

పామర్రు,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెదమద్దాలిలో వేంచేసి యున్న ఉద్ధండ వేణుగోపాల స్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన మిక్కిలినేని మధుసూధనరావు సతీమణి ప్రవాడ రూ.లక్ష నూటపదహార్లు, మరోదాత మిక్కిలినేని శివరామకృష్ణ ప్రసాద్ రూ. 5,116 ఆదివారం నగదును ఆలయ అధికారి జన్నువేంకటేశ్వరరావుకు అందజేశారు. గ్రామంలో జరిగే ఆలయ పునర్నిర్మాణంకోసం భక్తులు మరింత ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

వైసీపీ కార్యకర్తకు కొడాలి నాని పరామర్శ

గుడివాడ: వైసీపీ కార్యకర్తలకు, కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందిన కార్మికనగర్‌కు చెందిన నీరుడు భార్గవ్ కుటుంబాన్ని, స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోకేష్‌రాజును ఆయన పరామర్శించారు. మెరుగుమాల కాళీ, తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● వీఆర్ ఫణికుమార్

పామర్రు,నవంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య భద్రతలో 104 వాహనాల ద్వారా సేవలందిస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఎంఎంయూ ఎంప్లాయాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీఆర్ ఫణికుమార్ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. గత కాంట్రాక్టు కంపెనీ అరవిందో నుంచి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చొరవచూపి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్‌కేర్ ప్రైవేట్ కంపెనీ నుంచి నేటి వరకు పనిచేయించుకుంటున్నవారికి నియామక పత్రాలు అందించకుండా ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తుందని విమర్శించారు. మరోనేత వినయ్ మాట్లాడుతూ 104 వాహనాల్లో ఫార్మాసిస్టు, డ్రైవర్ పోస్టుల ఖాళీలను భర్తిచేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న వారికి కనీస వేతనం రూ.26వేలు అందించే విధంగా పోరాటం చేస్తామన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం రాబోయే జనవరి 4న విశాఖలో నిర్వహించే ఆల్‌ఇండియా మహా సభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎ.మురళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒడుగు గంగాధర ప్రసాద్, 104 వాహనాల ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఫణికుమార్

ముగిసిన గంగానమ్మ సంబరాలు

గుడ్లవల్లేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గంగానమ్మ అమ్మవారి సంబరమహోత్సవాల్లో చివరి రోజు ఆదివారం అమ్మవారికి నైవేద్యంగా పాలపొంగళ్లు సమర్పించే కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో మహాకుంభం పోసి , పాలవెల్లి ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో మహిళలు ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రవేశంతో సంబర మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జి పోలవరపు వెంకటరావు, గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ వెనిగళ్ల నాగేశ్వరరావు, వల్లభనేని బాపయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం సాధారణరీతిలో దర్శనం చేసుకున్నారు. 6 వేల మంది భక్తులు మాత్రమే దర్శనం చేసుకొన్నారు. భక్తులు ఆలయ పాకశాలలో పాలపొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు, కార్యనిర్వాహణాధికారి ఆకుల కొడలరావులు పర్యవేక్షించారు.


గంగానమ్మను దర్శించుకుంటున్న బాపయ్యచౌదరి

ఉచిత న్యాయసహాయం అందించడమే నల్సా లక్ష్యం

● న్యాయమూర్తి ఎస్.సుబ్రహ్మణ్యం

గుడివాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : చట్టం ముందు అందరూ సమానమేనని, పేదలకు ఎటువంటి ఖర్చులేకుండా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసేవలు అందించడానికి నేషనల్ లీగల్ అథారిటీ(నల్సా)ను ప్రారంభించామని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సుబ్రహ్మణ్యం అన్నారు. జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక బేతవోలులోని స్నేహ చిల్డ్రన్స్ హోమ్‌లో గుడివాడ మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయం అందించేందుకు లోక్‌అదాలత్‌లు కృషి చేస్తున్నాయన్నారు. అర్హులైన పేదవర్గాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక జువైనల్ కోర్టులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై గౌతమ్‌కుమార్, న్యాయవాదులు సాయిగణేష్, కమలామృతం, రఫీ, సుబ్రహ్మణ్యం, హోమ్ పర్యవేక్షకురాలు బేబిరాణి, పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో చరణ్ రుత్విక్‌కు కాంస్య పతకం

● యలవర్తి శ్రీనివాసరావు


గుడివాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఇటీవల గుంటూరు జిల్లా,తెనాలిలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం జిమ్ లిఫ్టర్ కాళి చరణ్ రుత్విక్ 73 కేజీల శరీర బరువు విభాగంలో 108 కేజీలు బరువునెత్తి కాంస్య పతకం సాధించినట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక స్టేడియం కార్యాలయంలో రుత్విక్‌ను ఆయన అభినందించారు. కాంస్య పతకగ్రహీత రుత్విక్, కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావులను స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, క్రీడాకారులు, సిబ్బంది అభినందించారు.


రుత్విక్‌ను అభినందిస్తున్న స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా మహా సుదర్శన యాగం

గుడ్లవల్లేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులో వేంచేసియున్న భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహా సుదర్శన యాగం కన్నులపండువగా నిర్వహించారు. మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనది సుదర్శన చక్రంగా, అటువంటి ప్రాశస్త్యం కలిగిన ఆయుధ యాగం ఈ సుదర్శన యాగంగా వేదపండితులు తెలిపారు. ఈ యాగం ప్రభావం వల్ల సమస్త మానవాళికి ఆయురారోగ్యాలతో వెలసిల్లుతారని వారు తెలిపారు. అలానే శత్రు దోష నివారణ, దృష్టి దోష నివారణ, అకాల మృత్యు దోషం నివారణ కలిగి, దంపతుల మధ్య అనుబంధం పెరుగుతుందని వేదపండితులు వివరించారు. ఈ మహాసుదర్శన యాగాన్ని సుదర్శన చక్రాన్ని పోలియుండే హోమగుండాన్ని ఏర్పాటు చేసి హోమం నిర్వహించారు. అలానే లక్ష్మీనారాయణ అపమృత్యు హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పి.వి సుబ్బారెడ్డి, సుమలత, పి.నాగిరెడ్డి, ప్రసన్న దంపతులు, వెంకట లక్ష్మీ, కృష్ణవేణిలతో పాటు ఆలయ ధర్మకర్త పి.వి.కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీనివాసునికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

గుడివాడ రూరల్ : గుంటాకోడూరులో రూ.8.50లక్షల వ్యయంతో రైల్వేస్టేషన్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంగడాల భారతి, ఎంపీటీసీ అంగడాల రామాంజనేయులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అంగడాల వీర్రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు వాసేమురళీ, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డుకు ఆటోవాలాల మరమ్మతులు

గుడివాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక రైల్వేస్టేషన్ రహదారిలో ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సీసీ రహదారిలోని జాయింట్‌ల వద్ద ఏర్పడిన గుంతలతో ఆటోవాలాలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆటోవాలాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలతో మరమ్మతులను చేపట్టారు. రైల్వేస్టేషన్‌కు పగలు సమయంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరికి ఇబ్బంది లేకుండా రాత్రి సమయంలో ఎక్కడైతే మరమ్మత్తులు చేస్తున్నారో ఆ ప్రదేశంలో ఆటోలను అడ్డుగా పెట్టి పనులు చేపట్టారు. చేసిన మరమ్మత్తులు పాడవ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టి సూచికలను ఏర్పాటు చేశారు.



రహదారికి మరమ్మతులు చేస్తున్న ఆటోవాలాలు

ఐకమత్యం పెంపొందించేందుకు వనసమారాధనలు దోహదం


పామర్రులో కార్తీక సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వనసమారాధనలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందింపచేస్తాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పట్టణంలోని సీతారామంజనేయ బాలభక్త చెక్కభజన సమాజం ఆధ్వర్యంలో మండల గౌడపేటలో పరిశ రాముడు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్‌రాజా టీడీపీ, జనసేననేతలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక దామోదరునికి, సీతారాముల స్వామికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి చెక్క భజనలు కీర్తనలు అలాపించారు. అనంతరం కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలతో కలిసి సహపంక్తి భోజనాలను చేశారు. అన్నసంతర్పణ ఏర్పాట్లను టీడీపీ సీనియర్ నేత వీరంకి వేంకటేశ్వరరావు, కందుల మస్తాన్, తదితరులు పర్యవేక్షించారు. తొలుత ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను దుశ్శాలువాలతో నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ , జనసేన నేతలు తాడిశెట్టి నరేష్, వల్లూరిపల్లి గణేష్, ప్రవీణ్‌చంద్ర, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.



మహాకుంభానికి పూజలు చేస్తున్న కూటమి నేతలు

గుడ్లవల్లేరు : మండలంలో ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు వైభవంగా నిర్వహించారు. గుడ్లవల్లేరులో వేంచేసి యున్న శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గ్రామ భక్తుల కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సమారాధనలో పాల్గొన్నారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో మండల బ్రాహ్మణ సంఘం వారు కారర్తీక వనసమారాధన నిర్వహించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనలో రాతి ఉసిరి చెట్టు క్రింద వనపూజను మండల సంఘ అధ్యక్షుడు వేముల వెంకట రత్నాచార్యులు, వై.ధనుంజయ దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాడ న్యాయమూర్తి దేవు నరసింహారావు, బ్యాంక్ విశ్రాంత మేనేజరు వసుధ బసవేశ్వరరావు, పెంటపాటి చిట్టిబాబు, నాగమల్లేశ్వరరావు, సుధీర్, కాశీ తాతారావు పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శాంతి నిమిత్తం దేవస్థాన ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అన్న సమారాధనను ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావులు ప్రారంభించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు ఏర్పాటు చేసిన మహాకుంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 9వేలమంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు చిన్న, కార్యనిర్వాహణాధికారి కందుల వేణుగోపాలరావు, పాల్గొన్నారు.

కూచిపూడి : పరమ శివుని జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని కూచిపూడి బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి విభూది, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, సతీష్ కుమార్ శర్మలు కార్తీకమాస సందర్భంగా ఆలయంలో అలంకరణ, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.


వనపూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం


విభూదితో అభిషేకాలు చేస్తున్న అర్చకులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

దుర్గానాగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మోపిదేవి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బుద్ధు వరప్రసాద్ ఆధ్వర్యంలో రుత్వికుల బృందం వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని జరిపారు. స్వామిని విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని దేవస్థానంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొన్నారు.



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు

సందడిగా వనభోజనాలు



బందరులో కాపు వనసమారాధనలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ



శ్రీకాకుళం శివాలయంలో..



నాగాయలంక తలశిల వారి వనసమారాధనలో కోలాట ప్రదర్శన

అవనిగడ్డ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ ఇరిగేషన్ అతిథిగృహ ప్రాంగణంలో అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు వనసమారాధన నిర్వహించారు. అవనిగడ్డ 6వ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి ఉసిరి చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వనసమారాధన నిర్వహించారు. జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.గోపి, మచిలీపట్నం 10వ అదనపు జడ్జి బాబూనాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత వోల్గా మార్క, బార్ అసోసియేషన్ సభ్యులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన రేపల్లె వంశీకులు పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయం వద్ద వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2 వేల మంది రేపల్లె వంశీకులు పాల్గొన్నారు. పాత ఎడ్లంకలోని మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణ మామిడితోటలో సింహాద్రి సిస్టర్స్ బ్రదర్స్, అల్లుళ్ల కలయికలో కార్తీక మాస వనసమారాధనను ఘనంగా నిర్వహించారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..

మచిలీపట్నం టౌన్: బ్రాహ్మణుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుట్టాయిపేట దత్తాశ్రమంలో బ్రాహ్మణ కార్తీకవనసమారాధన నిర్వహించారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.వి. ఫణికుమార్ తెలిపారు. బ్రాహ్మణ సంఘ నాయకులు కందుకూరి సత్యనారాయణ, కానుకొలను ఫణికిరణ్‌శర్మ, మోపర్తి సుబ్రహ్మణ్యం, జమ్మలమడక సేతురామయ్య, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, కాపవరపు చంద్రశేఖర్, కామశాస్త్రి, వడ్లమన్నాటి మారుతీదివాకర్, కావూరి రాధాకృష్ణమూర్తి, నందూరి సదాశివరావు, నామేశ్వరరావు, చోడవరపు దేవినాగలక్ష్మి ప్రసూన, పి.విమలగాయత్రి, ఎం.ఉమాదేవి పాల్గొన్నారు.



పులిగడ్డలో వన సమారాధనలో భోజనాలు చేస్తున్న న్యాయవాదులు

తలశిలవారి కార్తీక భోజనాలు

నాగాయలంక: తలశిలవారి గంగానమ్మ ఆలయంలో 14వ కార్తీక మాస వనభోజన మహోత్సవం వైభవంగా జరిగింది. కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

శ్రీకాకుళం శివాలయంలో..

ఘంటసాల: శ్రీకాకుళం ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద ఆలయ కమిటీ వారు వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుయువత రాష్ట్ర నాయకుడు తాడికొండ వెంకటేశ్వరరావు, అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు తోట శ్యాంకిషోర్‌నాయుడు పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో..

పెడన: పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని చిట్టూరి మాధవరావుతోటలో కార్తీక వనసమారాధన వైభవంగా నిర్వహించారు. పద్మశాలీయ సంఘ నాయకులు అనుముల పూర్ణ, నందం చినబాబు, దుడుగు రామ్మోహన్, చిలుకోటి గోవిందు, నందం నాని పాల్గొన్నారు.



యాదవ వనసమారాధనలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, కేపీ సారథి

వైభవంగా యాదవ వనసమారాధన

మచిలీపట్నం టౌన్: సామాజిక ఐకమత్యానికి వనసమారాధనలు ప్రతీక అని మంత్రులు కొల్లు రవీంద్ర, కేపీ సారథి అన్నారు. యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రొండి కృష్ణయాదవ్, గోపు సత్యనారాయణ, బచ్చుల బోసుబాబు, మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, యాదవ సంఘనాయకులు పల్లపాటి వెంకట్రావు, గొరిపర్తి రాము, ఆరెపు లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా బందరు మండలం గోకవరంలో నిర్వహించిన కార్తీకవనసమారాధనలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10 లక్షలు అందిస్తాం

కొండపల్లి ఎస్టేట్‌లో నిర్వహించిన కాపు ఆత్మీయ కార్తీకవనసమారాధనలో మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో కాపు కల్యాణ మండప నిర్మాణానికి రూ. 10 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, జనసేన నాయ కులు మాదివాడ రాము, కొట్టె వెంకట్రావు, టీడీపీ నాయకులు వాలిశెట్టి తిరుమలరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ మండలి కుటుంబం

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌పై మాజీ ఎమ్మెల్యే

సింహాద్రి రమేశ్‌బాబు వ్యాఖ్యలు గర్హనీయం: కూటమి నేతలు

అవనిగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ 'మండలి' కుటుంబం. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌పై మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు చేసిన వ్యాఖ్యలు గర్హనీయం.' అని నియోజకవర్గ కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌పై మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు వ్యాఖ్యలను వారు ఆదివారం అవనిగడ్డలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఖండించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎవరు ఏమైనా చేసుకోండి మాకు వాటా ఇవ్వండి అనే ధోరణితో ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యే, షాడో ఎమ్మెల్యేల తీరు ప్రజలందరికీ గుర్తుందన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రభుత్వ కార్యాలయాలను కనుసన్నల్లో నడిపిన తీరు ప్రజలకు తెలియంది కాదన్నారు. డీపీఆర్ లేకుండా బండి కోళ్లలంక బ్యారేజీ, శంకుస్థాపన లేకుండా ఎదురుమొండి వారధి నిర్మిం చేస్తున్నామని ప్రజలను నమ్మించాలని చూసింది ప్రజలు మరిచిపోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులతో మాట్లాడి మధ్యలో ఆగిపోయిన రహదారులను పునర్నిర్మించారని తెలిపారు. సింహాద్రి రమేశ్‌బాబు ఎలా వైసీపీ టికెట్ పొందారో అందరికీ తెలుసని అన్నారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, జనసేన పార్టీ మత్స్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకే యుగంధర్, ఎంపీటీసీ సభ్యుడు కటికల వసంత్, జనసేన నేత బచ్చు శ్రీహరి పాల్గొన్నారు.



పీవీ ఫణికుమార్ దంపతులను సత్కరిస్తున్న టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, 45వ డివిజన్ నాయకులు, పెద్దలు

45వ డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిది


- బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీవీ ఫణికుమార్

మచిలీపట్నం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవి రావడానికి కారణమైన 45వ డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిదని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్ అన్నారు. సిడింబి అగ్రహారంలో పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ నివాసం వద్ద ఆదివారం పీవీ ఫణికుమార్ దంపతులను డివిజన్ నాయకులు, కార్యకర్తలు అభినందించి సత్కరించారు. గంజాల రవికుమార్, కొనకళ్ల భానుప్రసాద్, బత్తిన అగస్త్యేశ్వరరావు, కేదరాశి నాగేశ్వరరావు, కొనకళ్ల అరుణ్‌కుమార్, మురాల కాశీ బాబు, కోమటి వెంకటేశ్వరరావు, రాయన రాజకుమార్, మురాల నాగేంద్రరావు, డాక్టర్ బొల్లా ప్రసాద్, డాక్టర్ బొందలపాటి సురేష్‌బాబు, ఆర్వీఎస్ మురళీధర్, ఎన్నారై గొర్రెపాటి శ్రీనివాస్‌చంద్, కాశీపట్నపు రఘు, మాదివాడ వెంకట నరసింహారావు, పుప్పాలప్రసాద్, పాలపర్తి పద్మజ పాల్గొన్నారు.

ఫణికుమార్‌కు అభినందన

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జాయింట్ సెక్రటరీ పీవీ ఫణికుమార్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా స్టార్ స్కూల్‌లో అభినందన సభ నిర్వహించారు. స్టార్ విద్యాసంస్థల ఫౌండర్ పి.శ్రీరామ్, డైరెక్టర్ అయ్యప్పస్వామి తదితరులు పీవీ ఫణికుమార్‌ను సత్కరించారు.

ఉత్సాహంగా వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్ పోటీలు



మాట్లాడుతున్న మండలి వెంకట్రామ్

అవనిగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దివి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ పోటీలను ప్రారంభించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. వాకర్స్ ట్రాక్స్, గ్రౌండ్ అభివృద్ధి, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామని మండలి వెంకట్రామ్ హామీ ఇచ్చారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆర్.రాఘవరావు, అధ్యక్షుడు పరుచూరి రాఘవేంద్రరావు, కోశాధికారి వడ్లమూడి శశివకుమార్ పాల్గొన్నారు.

నేత్రదానం

కోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిట్టల్లంకకు చెందిన చిరివేళ్ల పాండురంగారావు(80) నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. పాండురంగారావు ఆదివారం తెల్లవారుజామున మరణించారు. సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ మృతుడి కుమారుడు యానాదిరావు, కుటుంబసభ్యులను నేత్రదానానికి ఒప్పించారు. విజయవాడలోని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల వారు కార్నియా సేకరించి తీసుకెళ్లారు. తమ సంస్థ ద్వారా 249వ నేత్రదానం చేయించినట్టు తలశిల రఘుశేఖర్ తెలిపారు.

చెత్త సమస్యకు నెలాఖరులోగా పరిష్కారం చూపుతాం

- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

చల్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి డంపింగ్ యార్డులోని చెత్త సమస్యకు నెలాఖరులోగా పరిష్కారం చూపుతామని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర చైర్మన్ పి.కృష్ణయ్య తెలిపారు. స్వచ్ఛ చల్లపల్లి వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన డంపింగ్ యార్డును పరిశీలించారు. చెత్త నిల్వలను చూసి చెత్తను కాల్చవద్దని సూచించారు. డంపింగ్ యార్డులో పేరుకున్న చెత్తను పంచాయతీ బయటకు తరలించాలన్నా ఆర్థికభారం అవుతుందని, నెలాఖరులోగా బయటకు తరలించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పి.వి. మాధవేంద్రరావుకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, డాక్టర్ డీఆర్కే ప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, వార్డు సభ్యులు బళ్లా వాసు, మీర్ రిజ్వాన్, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నబీషేూరి పాల్గొన్నారు.

డాక్టర్ డీఆర్కే ప్రసాద్ దంపతులకు ముస్లింల కృతజ్ఞతలు

స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్- డాక్టర్ పద్మావతి ఔదార్యంతో నారాయణరావునగర్ కాలనీలోని ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధి చెందింది. రూ.11.50 లక్షలు వెచ్చించి జనాజా నమాజ్ షెడ్, ముఖద్వారం నిర్మించి గేట్లు అమర్చారు. ఆదివారం స్వచ్ఛ చల్లపల్లి వార్షికోత్సవం సందర్భంగా అతిథులు శ్మశానవాటిక ప్రాంగణాన్ని, నూతన నిర్మాణాన్ని పరిశీలించి ముస్లింలతో సమావేశమయ్యారు. శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించిన డాక్టర్ డీఆర్కే ప్రసాద్ దంపతులకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.



విరాళం అందిస్తున్న ప్రాతూరి శాస్త్రి

మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళాలు

స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు 11వ వార్షికోత్సవం సందర్భంగా పలువురు విరాళాలను ప్రకటించారు. స్వచ్ఛ చల్లపల్లికి వెన్నుదన్నుగా నిలిచిన డాక్టర్ గురవారెడ్డి రూ.2 లక్షలు విరాళం ప్రకటించారు. డాక్టర్ కాలేషావలి రూ.లక్ష విరాళం ప్రకటించారు. నెలవారీ పెన్షన్ మొత్తం నుంచీ ప్రతి నెలా విరాళం అందించే విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రాతూరి శాస్త్రి రూ.10వేలను ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డీఆర్కే ప్రసాద్‌కు అందజేశారు.



పడిపూజా కార్యక్రమంలో పాల్గొన్న మండలి విజయలక్ష్మి, మండలి వెంకట్రామ్, గురుస్వామి ఉదయ్‌కుమార్

వైభవంగా అయ్యప్ప పడిపూజ

చల్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రావెళ్ల కృష్ణ సేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్(18వ పడి) గురుస్వామి ఆధ్వర్యంలో మేకావారిపాలెంలో అయ్యప్ప పడిపూజా మహోత్సవం, 18 మెట్ల కలశపూజ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయ్‌కుమార్ దంపతులతో మధు నంబూద్రి అయ్యప్పస్వామికి అభిషేకాలు, మహాపడిపూజ, మెట్ల పూజ జరిపించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, యువనేత మండలి వెంకట్రామ్-సాయిసుప్రియ దంపతులు పూజలు చేశారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ప్రజాప్రతినిధులు, అయ్యప్ప, భవానీ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. రావెళ్ల కృష్ణసేవాసమితి అధ్యక్షుడు నిడమానూరి దిలీప్‌కుమార్, ప్రతినిధులు రావెళ్ల సుజాతకుమారి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న కోనేరుసెంటర్‌లో దివ్య మహా పడిపూజ

మచిలీపట్నం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న కోనేరుసెంటర్‌లో దివ్య మహా పడిపూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం బందరుకోట రామాలయంలో మహోత్సవం ఆహ్వాన పత్రికలను మంత్రి ఆవిష్కరించారు. అయ్యప్ప దీక్ష జిల్లా ప్రచార సమితి అధ్యక్షుడు బి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కోడూరులో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

కోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): షిరిడి సాయి దివ్యధ్యాన జ్ఞాన మందిరంలో కార్తీక మాస సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం సామూహిక సత్యదేవుడి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 2 వేల మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

వీర్లంకమ్మ దేవాలయంలో..

ఘంటసాల: కొత్తపల్లి గ్రామ ఇలవేల్పు వీర్లంకమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలను చేశారు. 50 మంది దంపతులు పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు- వరలక్ష్మి దంపతులు వీర్లంకమ్మను దర్శించుకుని పూజలు చేశారు. దేవాలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వదేశీ వస్తువులనే వినియోగిద్దాం



చిలకలపూడిలో ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి బీజేపీ ఫ్లోర్‌లీడర్ సోము వీర్రాజు

మచిలీపట్నం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులను వాడుతూ దేశాన్ని కాపాడుకుందామని ప్రజలకు శాసన మండలి బీజేపీ ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. చిలకలపూడిలో ఆదివారం ఆత్మనిర్భర్ భారత సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ పర్యటించి కరపత్రాలను పంచారు. గోడలకు స్టిక్కర్లు అతికించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పంతం వెంకట గజేంద్రరావు, బుచ్చిరాజు, గుత్తికొండ రాజబాబు, తోట రంగనాథ్, చలమలశెట్టి రామకృష్ణ, కూనపరెడ్డి శ్రీనివాసరావు, పుప్పాల రాము, తుంగల మురళి పాల్గొన్నారు.

వైన్‌షాపులో గలాటా

మచిలీపట్నం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్ సెంటర్‌లోని ఎస్ఆర్‌డీ వైన్‌షాపులో పూటుగా మద్యం తాగి మందు బాబులు గలాటాకు దిగారు. బీరు సీసాలతో కొట్టుకున్నారు. కుమార్ అనే వ్యక్తిపై నలుగురు దాడి చేశారు. కుమార్‌ను మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు

80 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు

నాగాయలంక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి వారితో ఉచిత కంటి వైద్యశిబిరం ఆదివారం నాగాయలంక మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో నిర్వహించారు. వైద్యులు అపర్ణ, శృతిక 80 మందికి వైద్య పరీక్షలు చేసి, అందులో 60 మందిని శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు. క్యాంప్ ఇన్‌చార్జి ప్రసన్నకుమార్, తలశిల లీలా మనోహర్ పర్యవేక్షించారు.

వైభవంగా సుదర్శన, లక్ష్మీనరసింహ హోమాలు

అవనిగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆయలంలో కార్తీక బహుళ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామికి విశేష అభిషేకాలు, లక్ష్మీనరసింహ హోమం, సుదర్శన హోమం, శాంతి హోమాలను వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు బృందావనం నరసింహమూర్తి అధ్యక్షతన ఈ ప్రత్యేక కార్యక్రమాలు జరుగగా, స్వామివారిని లక్ష కదళీదళ ఫలాలు, విశేష ఫలాలతో అర్చనలు నిర్వహించారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

చల్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా లక్ష్మీపురంలోని దుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామిని 20 రూపాలయ నాణేలతో, కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయ ఆవరణలో కార్తీక వనసమారాధన నిర్వహించారు.



నాణేలు, కరెన్సీ నోట్లతో అలంకరించిన స్వామి

వైభవంగా రామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం

మచిలీపట్నం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామికి వైభవంగా శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యం, నీరజ దంపతులు కల్యాణం జరిపించారు. ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

రెండు బైక్‌లు దగ్ధం



దగ్ధమైన బైక్‌లు

మచిలీపట్నం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చల్లరస్తా సెంటర్‌లోని మెకానిక్ షెడ్డుకు దగ్గరలో ఒక ఖాళీ ప్రదేశంలో నిలిపి ఉంచిన రెండు మోటారు బైక్‌లు ఆదివారం దగ్ధమయ్యాయి. బైక్‌ల పక్కన చెత్తా చెదారం ఉంది. ఎవరో సిగరెట్ తాగి అక్కడ వేసి ఉంటారని, దీంతో నిప్పంటుకుని బైక్‌లు దగ్ధమయ్యాయని భావిస్తున్నారు. బైక్‌ల యజమానులే స్వయంగా మంటలను ఆర్పుకున్నారు. దగ్ధమైన బైక్‌లు పాతవి కావడంతో వాటిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఆర్‌పేట పోలీసులను అడగ్గా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.